ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 5 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 140 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

'హర్మూజ్'లో భారత నౌకలకు
ఇరాన్ సడలింపు

ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం 2





2

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రూ.2 కోట్ల
లంచం ఆరోపణలు

విజిలెన్స్ విచారణకు
కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఢిల్లీ VS గల్లీ!

ఢిల్లీ వేదికగా రాజకీయ ఆరోపణలు.. గల్లీ స్థాయిలో ప్రజల సమస్యలు! తెలంగాణ రాజకీయాల్లో ఆర్ఆర్ టాక్స్ వివాదం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవినీతి ఆరోపణలు రాజకీయ వేడిని పెంచగా.. కాంగ్రెస్ నేతలు కూడా అదే స్థాయిలో కౌంటర్ అటాక్‌కు దిగుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అంశాన్ని తెరపైకి తెస్తూ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య సంబంధాలపై కాంగ్రెస్ ప్రశ్నలు సంధిస్తోంది. ఇలా ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అయితే ఈ రాజకీయ పోరాటాల మధ్య సామాన్యుడి సమస్యలకు పరిష్కారం ఎక్కడ? పన్నుల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న డబ్బు ఎక్కడ ఖర్చవుతోంది? అభివృద్ధి పనులకు నిధులు ఎందుకు సరిపోవడం లేదు? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ బ్యూరో, సింగిడి

ఆర్ఆర్ టాక్స్ ఆరోపణల వెనుక అసలు కథేంటి?



- తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఆర్ఆర్ టాక్స్ వివాదం
- రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్ షా చేసిన అవినీతి ఆరోపణలు
- ఆరోపణలను తిప్పికొడుతూ కాంగ్రెస్ నేతల ఎదురుదాడి
- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కాంగ్రెస్ సంధిస్తున్న ప్రశ్నలు
- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ విమర్శలు
- ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య మరుగునపడుతున్న ప్రజా సమస్యలు

ఆర్ఆర్ టాక్స్ కలకలం

తెలంగాణలో అవినీతి జరుగుతోందంటూ ఆర్ఆర్ టాక్స్ అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. రాష్ట్ర ప్రభుత్వంపై వచ్చిన ఈ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండిస్తూ ఎదురుదాడి చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే ఆధారాలు బయటపెట్టాలని, రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మరోవైపు అధికార పార్టీపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే చర్చ కూడా సాగుతోంది. ఆరోపణలు, ఖండనలు కొనసాగుతున్నప్పటికీ.. ఆర్ఆర్ టాక్స్ అంటే ఏమిటి? దానికి ఆధారాలేమిటి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

కాళేశ్వరంపై కౌంటర్లు

ఆర్ఆర్ టాక్స్ ఆరోపణలకు కౌంటర్‌గా కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకలు, నాణ్యతాపరమైన ప్రశ్నలు, ప్రజాధనం వినియోగంపై సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

...మిగతా 2లో



సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ వేడుకలు

సదర్ సమ్మేళనానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం సదర్ వేడుకలతో సందడిగా మారింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్న రాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లు హాజరై సదర్ ఉత్సవాల ప్రత్యేకత, సంస్కృతి గొప్పతనం గురించి మాట్లాడారు.

-హైదరాబాద్, నవంబర్ 4 (సింగిడి)

మహానగరంలో నీటి కొరత

హైదరాబాద్‌లో నీటి కష్టాలు..

వాటర్ ట్యాంకర్ల బంద్‌తో హాస్టళ్లు ఖాళీ, అపార్ట్‌మెంట్లలోనూ సరఫరా నిలిపివేత! 2



హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు.

-హైదరాబాద్ (సింగిడి)



మధ్యంతర ఎన్నికల్లో
ట్రంప్‌కు ఎదురుదెబ్బ

కాన్సస్ కంచుకోట కూలింది..

94 ఏళ్ల తర్వాత

డెమోక్రాట్ల సంచలన విజయం 2

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫలితాల్లో డెమోక్రాట్లు భారీ ఆధిక్యంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే సెనెట్‌లో ఆధిపత్యం సాధించగా.. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు మెజార్టీ మార్క్ (218) దాటేశారు. ఇక కాన్సస్‌లో రిపబ్లికన్ల కంచుకోట కూలింది. 94 ఏళ్ల తర్వాత కాన్సస్ రాష్ట్రంలో సెనెట్ స్థానం డెమోక్రాట్ల వశమైంది కాన్సస్ లో దశాబ్దాలుగా కొనసాగుతోన్న రిపబ్లికన్ల ఆధిపత్యానికి డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ తెరదించి చరిత్ర సృష్టించారు. సిట్టింగ్ రిపబ్లికన్ అభ్యర్థి రోజర్ మార్షల్‌పై ఆయన సంచలన విజయం సాధించారు. 1932 తర్వాత డెమోక్రటిక్ పార్టీ తరపున సెనెటర్‌గా గెలిచిన మొదటి వ్యక్తిగా నిలిచారు.

- న్యూఢిల్లీ, నవంబర్ 4 (సింగిడి)

మీది మేనేజ్‌మెంట్ కోటా..
మాది మెరిట్ కోటా!

కేటీఆర్ 'బౌన్సర్' కామెంట్స్‌కు బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన 'బౌన్సర్' వ్యాఖ్యలపై సంజయ్ నిప్పులు చెరిగారు. కేటీఆర్‌ను "ట్విట్టర్ టిల్లు" అంటూ ఎద్దేవా చేసిన ఆయన.. "మీది తండ్రి పేరు చెప్పుకుని వచ్చిన మేనేజ్‌మెంట్ కోటా అయితే.. మేం ప్రజల కోసం లారీదెబ్బలు తిని ఎదిగిన మెరిట్ కోటా" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

-హైదరాబాద్, నవంబర్ 4 (సింగిడి)





ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సందడి!

2.21 లక్షల కుటుంబాలతో పండుగ జరుపుకోనున్న ప్రభుత్వం

'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం

గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు వెళ్లి పాల్గొననున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల మంజూరు.. 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి

మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో.. రూ.40 వేల కోట్లతో పథకం అమలు



2

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు వెళ్లి కుటుంబాలతో పండుగ జరుపుకోనున్నారు.

-హైదరాబాద్, నవంబర్ 4 (సింగిడి)

సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీకి బిగ్ బూస్ట్



3 కీలక పథకాలకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్!

గ్రిడ్ స్కేల్ ఎనర్జీ స్టోరేజ్, క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్‌పై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు 2

వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

భారత పునరుత్పాదక ఇంధన రంగం, అత్యాధునిక తయారీ పరిశ్రమలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రివర్గం మూడు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. క్లీన్ ఎనర్జీ స్టోరేజ్, క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్, దేశ గణాంక వ్యవస్థ ప్రక్షాళన రంగాల్లో భారీ కార్యాచరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన స్పష్టం చేశారు.

- న్యూఢిల్లీ, నవంబర్ 4 (సింగిడి)

నేడు ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎస్ఈసీ పునేఠా

ఎన్నికలపై ఎస్ఈసీ సమీక్ష.. కీలక ఆదేశాలు 2

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు

-అమరావతి, నవంబర్ 4 (సింగిడి)

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర కష్టాల్లో రైతులు

పంటల బీమా పరిహారం త్వరగా అందించాలి.. కేంద్ర బృందాన్ని కోరిన చంద్రబాబు

అమరావతి: ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్రం ఉదారంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగానికి అండగా నిలిచేలా పీబీజీ రామ్‌జీ పథకం పనిదినాలను 200కు పెంచాలని కోరారు. అర్హులైన కరవు బాధితులకు డ్రాట్ కార్డులు జారీ చేయడంతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించాలన్నారు. కరవు, తుపాను నష్టాలతో సతమతమవుతున్న రాష్ట్రానికి ప్రత్యేక సాయం మంజూరు చేయాలని కేంద్ర బృందాన్ని కోరారు.

-అమరావతి, నవంబర్ 4 (సింగిడి)



2



రాహుల్‌ను
ప్రధానిని చేస్తాం

తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం.. 2

తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసి తీరుతామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

-హైదరాబాద్, నవంబర్ 4 (సింగిడి)

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సందడి!

తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా పలు నగరాల్లో జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో ఈసారి దీపావళి వేడుకలు ప్రత్యేకంగా జరగనున్నాయి. పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ' మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొని లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ పేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొనసాగిస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా.. అందులో ఇప్పటివరకు 2,21,500 ఇళ్లు పూర్తి చేసి.. గృహప్రవేశాలు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దీపావళి రోజున ప్రతి నియోజకవర్గంలో గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల వద్ద ప్రత్యేక వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ప్రజాప్రతినిధులు దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని మంత్రి పొంగులేటి కోరారు. పేదల ఇంట్లో వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ వేడుకలు ఘనంగా జరగాలని మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబులు సూచించారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, ఈ పథకంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం విస్తరణపై కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వివరాలు వెల్లడించారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లతో పాటు రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్ కూర్ ఏరియా పరిధిలో మరో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల తరహాలోనే మిగిలిన జిల్లాల్లోనూ టవర్లు నిర్మిస్తామని చెప్పారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్లలోనూ జీ+5 విధానంలో టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు.

ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను దీపావళిలోగా జారీ చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల నుంచి పచ్చే ఏడాది బోనాల వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయబోమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం నేరుగా నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దీపావళి వేడుకల ద్వారా కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టిన కుటుంబాలకు పండుగ ఆనందాన్ని మరింత చేరువ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి వేడుకల్లో పాల్గొనాలని మంత్రి పొంగులేటి మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ వర్సెస్ గల్లీ!

మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య వాస్తవాలు ఏంటి? దర్యాప్తుల్లో తేలిన అంశాలేంటి? రాజకీయ వేదికలపై వినిపిస్తున్న ఆరోపణలకు ఆధారాలున్నాయా? అన్నది ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది.

ఢిల్లీ రాజకీయాలు.. గల్లీ సమస్యలు

రాష్ట్ర రాజకీయాల్లో నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నా.. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు మాత్రం అలాగే ఉన్నాయి. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. పట్టణాల్లో అభివృద్ధి పనులు నిధుల కొరతతో నెమ్మదిస్తున్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ స్థాయిలో నేతలు చేసే ఆరోపణలు గల్లీ స్థాయిలో ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడతాయన్న ప్రశ్న తలెత్తుతోంది. రాజకీయ వివాదాలు వార్తల్లో నిలుస్తున్నా.. ప్రజల దైనందిన సమస్యలు మాత్రం పాలకుల దృష్టిని కోరుతున్నాయి.

పన్నుల భారం.. ప్రజల ఆవేదన

నిత్యావసరాల ధరలు, విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నులు, ఇతర పన్నులు, ఛార్జీల రూపంలో ప్రజలు నిరంతరం ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుస్తున్నారు. ఈ ఆదాయం తిరిగి ప్రజలకు మౌలిక సదుపాయాలు, సంక్షేమం, అభివృద్ధి రూపంలో అందాలి. కానీ పన్నుల భారం పెరుగుతున్నప్పుడు దానికి తగిన సేవలు, సదుపాయాలు అందుతున్నాయా? అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. ప్రజాధనం ఎక్కడికి వెళ్తోంది? ఏ పనులకు ఎంత ఖర్చవుతోంది? నిధుల వినియోగంలో పారదర్శకత ఉందా? అనే అంశాలపై ప్రభుత్వాలు స్పష్టమైన వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రజాధనానికి జవాబుదారీతనం

రాజకీయ పార్టీలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై ఆధారాలతో విచారణ జరగాలి. తప్పు చేసిన వారు ఎవరైనా బాధ్యత వహించాలి. అదే సమయంలో ప్రజల పన్నుల రూపంలో సమకూరిన ప్రతి రూపాయికి ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలి. నిధుల కేటాయింపు, ఖర్చు, పనుల పురోగతి వంటి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాధనం వినియోగం కాకుండా.. ప్రజల అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నదే పౌరుల ప్రధాన ఆకాంక్ష. ఢిల్లీ వేదికగా ఆర్ఆర్ టాక్స్ ఆరోపణలు.. తెలంగాణలో కాళేశ్వరం అంశంపై ఎదురుదాడులు.. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ విమర్శలు.. ఇవన్నీ రాజకీయ చర్చలో భాగమే. కానీ ఈ వివాదాల అంతిమ ప్రయోజనం ప్రజలకు ఏమిటన్నదే అసలు ప్రశ్న. ఆరోపణలకు ఆధారాలు చూపాలి.. అవినీతి ఉంటే చర్యలు తీసుకోవాలి.. ప్రజాధనం వినియోగంపై పారదర్శకత పాటించాలి. రాజకీయ డ్రామాలు, పరస్పర విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు నిజమైన సంక్షేమం, అభివృద్ధి అందించాలి. ఢిల్లీ రాజకీయాలకు అతీతంగా గల్లీ ప్రజల అవసరాలే పాలనకు ప్రాధాన్యత కావాలి.

మీది మేనేజ్‌మెంట్ కోటా.. మాది మెరిట్ కోటా!

అమిత్ షా పర్యటన.. క్రెడ్ కంట్రోల్‌పై రాద్ధాంతమా?

హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న పాదయాత్రకు కార్యకర్తలు, జనం భారీగా పోటెత్తారని బండి సంజయ్ గుర్తుచేశారు. ఆ సమయంలో తోపులాట జరగకుండా తమ పార్టీ శ్రేణులను, జనాన్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తే.. దాన్ని పట్టుకుని బౌన్సర్ అంటూ హేళన చేస్తారా అని ప్రశ్నించారు. "సొంత పార్టీ కార్యకర్తలపైనే బౌన్సర్లతో దాడులు చేయించిన దుర్మార్గపు సంస్కృతి బీఆర్ఎస్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు కార్యకర్తలను గాలికి వదిలేసిన చరిత్ర మీది" అంటూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మియాపూర్ భూముల అమ్మకంపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఫైర్

రాష్ట్రంలోని విలువైన భూములను కారు చౌకగా అమ్మేసి దోచుకున్న ఘనత కేసీఆర్ కుటుంబానికే దక్కుతుందని బండి సంజయ్ ఆరోపించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అదే దారిలో నడుస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన 6 గ్యారెంటీలను పక్కనపెట్టి, మియాపూర్ భూములను తెగనమ్మి ఢిల్లీ అధిష్టానానికి కప్పం కట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోందని ధ్వజమెత్తారు.

కండక్టర్ ప్రవళిక మృతిపై దిగ్భ్రాంతి.. ఆర్టీసీ సిబ్బందిని ఇబ్బంది పెట్టొద్దు

ఇటీవల బస్సులో జరిగిన తోపులాట ఘటనలో ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి చెందడంపై బండి సంజయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసౌకర్యాలపై ఉన్న కోపాన్ని ప్రయాణికులు ఆర్టీసీ కార్మికులపై చూపించవద్దని విజ్ఞప్తి చేశారు. రిపోర్ట్‌మెంట్ తర్వాత సరైన పెన్షన్ కూడా లేకపోయినా, నిత్యం కోటి మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు సిబ్బంది ఎంతో ఓపికతో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో శ్రమిస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రజలు మానవతా దృక్పథంతో మెలగాలని ఆయన కోరారు.

అసలేం జరిగింది?

హైదరాబాద్‌లో అమిత్ షా పర్యటించిన సమయంలో బండి సంజయ్ ఆయన వెంట ఉంటూ సెక్యూరిటీ/బౌన్సర్‌లా ప్రవర్తించారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

కేంద్ర మంత్రి హోదాలో ఉంటూ కరీంనగర్ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బౌన్సర్ కంటే దారుణంగా వ్యవహరించారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బండి సంజయ్ ఈ ఘాటైన ప్రతిస్పందనను ఇచ్చారు.

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

రాష్ట్ర ప్రజలందరికి రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సదర్ సంబురాల ద్వారా యాదవులు పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవమని, ఇది ఓ అద్భుతమైన కార్యక్రమమని సీఎం కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నామని, తమ ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారని, మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని సదర్ వేడుకకు హాజరయ్యానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచామని స్పష్టం చేశారు.

ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవ్వాలి

సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయానికి పశుసంపద ఎంతో కీలకమని పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవ సంస్కృతి ప్రపంచానికి చాటడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో వారు భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు.

రిజర్వేషన్లు కల్పించాలి

యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫలితాల్లో డెమోక్రాట్లు భారీ ఆధిక్యంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే సెనెట్‌లో ఆధిపత్యం సాధించగా.. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు మెజార్టీ మార్క్ (218) దాటేశారు. ఇక కాన్సస్‌లో రిపబ్లికన్ కంచుకోట కూలింది. 94 ఏళ్ల తర్వాత కాన్సస్ రాష్ట్రంలో సెనెట్ స్థానం డెమోక్రాట్ల వశమైంది కాన్సస్)లో దశాబ్దాలుగా కొనసాగుతోన్న రిపబ్లికన్ల ఆధిపత్యానికి డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ తెరదించి చరిత్ర సృష్టించారు. సిట్టింగ్ రిపబ్లికన్ అభ్యర్థి రోజర్ మార్షల్‌పై ఆయన సంచలన విజయం సాధించారు. 1932 తర్వాత డెమోక్రటిక్ పార్టీ తరపున సెనెటర్‌గా గెలిచిన మొదటి వ్యక్తిగా నిలిచారు

రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఛాలెంజ్‌గా తీసుకుంటామన్నారు. బుధవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఇంట్లోనే ప్రధాని పదవి పుట్టింది. ఆయన ప్రధాని కావాలనుకుంటే 2004లోనే అయ్యేవారు. రాముడి పేరు చెప్పుకుని మూడుసార్లు ప్రధాని అయిన మోదీ.. ఆయన అడుగుజాడల్లో పని చేయడం లేదు. స్వాతంత్ర్య ఉద్యమంలోనే మహాత్మాగాంధీ.. రఘుపతి రాఘవ రాజారాం అని రాముడి భజన చేశారు. అప్పటికీ బీజేపీ పుట్టలేదు.. మోదీ, అమిత్ షాలు కూడా పుట్టి ఉండరు అని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదని అమిత్ షా మాట్లాడారు. అమిత్ షా ఒక విషయం మర్చిపోతున్నారు. అమిత్ షా మీరు అధికారంలోకి రాకముందు ఏం జరిగిందో మీ కుటుంబ సభ్యులని అడిగి తెలుసుకోండి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలు నేరుగా నెహ్రూని ప్రధానిగా ఎన్నుకున్నారు అని గుర్తు చేశారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడింది. సోనియా, రాహుల్ గాంధీని ప్రధాని కావాలని ఎంపీలు అందరు తీర్మానం చేశారు. కానీ మాకు ప్రధాన మంత్రి పదవి వద్దన్నారు. మన్మోహన్ సింగ్‌ని ప్రైమ్ మినిస్టర్ చేశారు. మన్మోహన్ సింగ్ సైతం ప్రైమ్ మిస్టర్ అయ్యాక రాహుల్ గాంధీ దగ్గరికి వెళ్ళి మీరు ప్రధానమంత్రి కావాలని కోరారు. కానీ రాహుల్ గాంధీ తిరస్కరించి మీరే ఉండాలి.. మీ నేతృత్వం లోనే పని చేస్తామని అన్నారని జగ్గారెడ్డి తెలిపారు

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర కష్టాల్లో రైతులు

అర్హులైన కుటుంబాలకు డ్రాట్ కార్డులు ఇవ్వాలి..

కరవు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ బుధవారం సీఎం చంద్రబాబును కలిసింది. ఈ బృందం ఈనెల 2, 3వ తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించింది. రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైందని, రాయలసీమలో సాగు, తాగునీరు, పశుగ్రాసం సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సీఎం వివరించారు. 21 జిల్లాల్లో 388 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వీబీజీ రామ్‌జీ పథకం కింద పనిదినాలను 200కు పెంచాలని కోరారు. వ్యవసాయ పనులకు ఈ పథకాన్ని వినియోగించేలా వెసులుబాటు కల్పిస్తే రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరుగుతుందని వివరించారు. అర్హులైన కుటుంబాలకు డ్రాట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని, రైతుల రుణాల రీషెడ్యూలింగ్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

15 రోజుల్లో కేంద్రానికి నివేదిక..

పడిపోయిన భూగర్భ జలమట్టాలను పెంచేందుకు జల్ జీవన్ మిషన్‌ను విస్తరించాలని ముఖ్యమంత్రి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానానికి కేంద్రం సహకరించాలన్నారు. పంటల బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా రైతుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పశుగ్రాసం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని బృందం సభ్యులు.. ముఖ్యమంత్రికి తెలిపారు.

మరోవైపు కోస్తాంధ్ర జిల్లాల్లో తుపాను కారణంగా పంటలు, ఇతర రంగాలకు జరిగిన నష్టాన్ని కూడా చంద్రబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. విభిన్న ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం తగిన సాయం అందించాలని కోరారు.

'హర్మూజ్'లో భారత నౌకలకు ఇరాన్ సడలింపు

న్యూఢిల్లీ, నవంబర్ 4 (సింగిడి)

ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి లో నౌకల రాకపోకలపై విధించిన ఆంక్షల నుంచి భారత్ సహా నాలుగు దేశాలకు ఇరాన్ సడలింపు ఇచ్చింది. భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేసేందుకు భారత నౌకలకు ఈ మినహాయింపు ఇస్తున్నట్లుగా ఇరాన్ పార్లమెంట్ కమిటీ వైస్ చైర్మన్ అహ్మద్ హయత్-మొగద్దమ్ వెల్లడించారు.

ఆ నాలుగు దేశాలకు మినహాయింపు..

హర్మూజ్ జలసంధిలో ఎదురవుతున్న భద్రతా ముప్పుల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, చైనా, ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన నౌకలకు ఈ జలసంధి గుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, తమ దేశానికి అత్యవసరమైన ఔషధాలను భారత్ నుంచి దిగుమతి చేసుకోవడం సులభతరం చేసేందుకే భారత నౌకలకు అనుమతి ఇచ్చినట్లుగా ఇరాన్ స్పష్టం చేసింది. అదే సమయంలో చైనా రాజకీయ మద్దతు పొందడం కోసం చైనా నౌకలకు అనుమతి ఇచ్చింది. దీంతో హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే భారత, చైనా నౌకల నుంచి ఇరాన్ రవాణా ఫీజు వసూలు చేయనుంది. మరోవైపు ఇటీవల జలసంధి సమీపంలో చోటుచేసుకున్న దాడుల్లో గుజరాత్‌కు చెందిన భారత నావికుడు గాంధార్ నహీమ్ అజీజ్ మృతి చెందడంతో పాటు అనేక మంది నావికులు ప్రమాదంలో పడ్డారు. వాణిజ్య నౌకలపై దాడులను అరికట్టాలని, రవాణా స్వేచ్ఛను పునరుద్ధరించాలని భారత్, ఇరాన్‌కు విజ్ఞప్తి చేసింది.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రూ.2 కోట్ల లంచం ఆరోపణలు

న్యూఢిల్లీ, నవంబర్ 4 (సింగిడి)

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు. మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఈ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్స (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు. గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

నేడు ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎన్నికల కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది, కౌంటింగ్‌లో 52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.61 కోట్లకు చేరిందని పేర్కొన్నారు.

ఎన్నికల బందోబస్తుపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున రద్దీని నియంత్రించేందుకు తగినంత బలగాలను మోహరించామని వివరించారు.

సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీకి బిగ్ బూస్ట్

పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పూర్తిస్థాయిలో పెంచేందుకు 92 గిగావాట్-అవర్స్ సామర్థ్యంతో గ్రిడ్-లెవల్ ఎనర్జీ స్టోరేజ్ స్కీమ్‌ను కేబినెట్ ఆమోద

భూంపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి



8 మంది అరెస్ట్..13,390 నగదు, 8 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 04(సింగిడి)

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై సదాశివనగర్ పోలీసులు ప్రత్యేకంగా దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా పోలీసులు రూ.13,390 నగదు, 8 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.జూదం ఆడితే కఠిన చర్యలుఅక్రమ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతుందని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ హెచ్చరించారు. జూదానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, కుటుంబాలను రోడ్డున పడేయవద్దని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని హితవు పలికారు.తమ పరిసర ప్రాంతాల్లో పేకాట, ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై పుష్పరాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యలను పట్టని సీఎం రేవంత్ రెడ్డి..

ఢిల్లీకి చెక్కర్లు.. సామాన్యుడి ఇక్కట్లు..

మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ఢిల్లీ పర్యటనల కోసం గాలిమోటార్లలో చక్కర్లు కొడుతున్నారని మాజీ జెడ్పీ చైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద గత 23 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడేళ్ల కాలంలో ముఖ్యమంత్రి 90 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఆ పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశం ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. ఢిల్లీ పర్యటనలకు, హెలికాప్టర్ ప్రయాణాలకు ప్రజాధనాన్ని వృథా చేయకుండా గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం వైద్యసేవలు అందించే ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని పుట్ట మధూకర్ పేర్కొన్నారు. ఈ సిబ్బందిలో దాదాపు 90 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ, వారికి కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడం అనాగరికమన్నారు. అంతేకాకుండా, ఈహెచ్ఎస్ , ఈఎస్ఐ వంటి వైద్య సౌకర్యాలు, బీమా పథకాలు, ఎక్స్‌గ్రేషియా కల్పించకపోవడంపై మండిపడ్డారు. 'సమాన పనికి సమాన వేతనం' అనే సూత్రాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టారు. గర్భిణులు, చిన్నారులకు సేవలు అందించే ఉద్యోగులు 23 రోజులుగా విధులకి దూరంగా ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం ఇబ్బందుల్లో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, రుణమాఫీ, పీఆర్‌సీ అమలు చేస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఎన్హెచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని మరియు ప్రసూతి సెలవులతో పాటు ఇతర వైద్య సౌకర్యాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎన్హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని ఈ సందర్భంగా పుట్ట మధు స్పష్టం చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యపై స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి):

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సకాలంలో స్పందిస్తే ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందనే దానికి వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఆదర్శనగర్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణమే నిదర్శనంగా నిలుస్తోంది. కాలనీలో సెప్టిక్ ట్యాంక్ సౌకర్యం లేకపోవడంతో స్థానికులు కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, తొలుత పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. దీంతో కాలనీవాసుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి.ఈ విషయాన్ని కాలనీ ప్రజలు పంచాయతీరాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ ప్రజల సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. మొదట పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మరో కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.అధికారుల చొరవతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు తాజాగా పూర్తయ్యాయి. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న కాలనీవాసుల సమస్యకు పరిష్కారం లభించనుంది. త్వరలోనే సెప్టిక్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకురానున్నారు.ప్రజల సమస్యలను గుర్తించి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులను ప్రత్యామ్నాయ మార్గంలో పూర్తి చేయించిన పంచాయతీరాజ్ శాఖ అధికారుల చొరవపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిర్మాణం పూర్తి చేయించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

గడ్డి విత్తనాల పంపిణీలోనూ అరకొరే!

ఏలినో ముప్పు పొంచి ఉన్నా.. రైతులకు అందని పూర్తి సాయం

జిల్లాకు 30 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరం.. అక్టోబర్‌లో పంపిణీ చేసింది కేవలం 4.8 మెట్రిక్ టన్నులే!..మరో 20 మెట్రిక్ టన్నుల విత్తనాల కోసం ఎదురుచూస్తున్న రైతులు.. ప్రభుత్వ తీరుపై రైతుల ఆందోళన



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి):

ఒకవైపు ఏలినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతూ పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉండగా, మరోవైపు పశువులకు అవసరమైన పచ్చగడ్డి పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. పశుసంపదపై ఆధారపడి జీవనం సాగించే రైతులకు అండగా నిలవాల్సిన పశుసంవర్ధక శాఖలో గడ్డి విత్తనాల పంపిణీ అరకొరగా సాగుతుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వనపర్తి జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా సుమారు 30 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు అవసరమని అంచనా ఉండగా, అక్టోబర్ నెలలో కేవలం 4.8 మెట్రిక్ టన్నుల విత్తనాలు మాత్రమే పంపిణీ చేసినట్లు అధికారులు చెప్తున్నారు. అంటే అవసరమైన పరిమాణంలో ఐదో వంతు కూడా రైతులకు చేరలేదనే పరిస్థితి నెలకొంది. ఇంకా సుమారు 20 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. దీనికోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని చెప్పారు. గత ఏడాది 12.5 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అవసరానికి, పంపిణీకి మధ్య ఇంతటి వ్యత్యాసం ఉన్నప్పటికీ మిగిలిన విత్తనాలను ఎప్పుడు అందిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.–ఏలినో ప్రభావంపై ముందస్తు ప్రణాళిక ఏది?ఏలినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున పశువులకు పచ్చగడ్డి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గడ్డి విత్తనాలను సకాలంలో పంపిణీ చేస్తే రైతులు తమ పొలాల్లో పశుగ్రాసాన్ని సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ విత్తనాల పంపిణీలో జాప్యం జరిగితే సాగుకు అనుకూలమైన సమయం చేజారిపోవడమే కాకుండా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

రైతులకు ఎంతమేర విత్తనాలు అవసరం? మండలాల వారీగా ఎంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు? ఎంతమందికి పంపిణీ చేశారు? ఇంకా ఎంత నిల్వ ఉంది? అదనపు విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా? అనే అంశాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించాల్సి ఉంది. జిల్లాలో అవసరాలను ముందుగానే గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం, కేటాయింపులు సాధించడం, వచ్చిన విత్తనాలను అర్హులైన రైతులకు సకాలంలో అందించడం అధికారుల బాధ్యత. ఈ ప్రక్రియలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పశుసంపదను కాపాడేదెవరు?

వ్యవసాయంతోపాటు పాడి పశువుల పెంపకంపై ఆధారపడిన అనేక కుటుంబాలకు పశుసంపదే జీవనాధారం. వనపర్తి జిల్లాలో 58163 పశువులు, 65098 గేదెలు, 1059415 గొర్రెలు, 74710 మేకలు ఉన్నాయి. పశువులకు సరిపడా పచ్చగడ్డి అందకపోతే రైతులు బయట నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో అదనపు ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వ పథకాల ఉద్దేశం రైతులపై ఈ భారాన్ని తగ్గించడమే అయినప్పటికీ, అవసరమైన సమయంలో విత్తనాలు అందకపోతే ఆ పథకాల ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసే గడ్డి విత్తనాల బ్యాగు 5 కిలోలు ఉంటుంది. దానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.423.75 ఉండగా ప్రభుత్వం రూ.315 సబ్సిడీ ఇవ్వగా రైతు వాటా రూ.108.75 చెల్లించాల్సి ఉంటుంది. రైతుల అవసరాన్ని బట్టి ఒక్కొక్క రైతుకు 15 నుండి 20 కేజీల వరకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తారు.

ప్రభుత్వం స్పందించేదెప్పుడు?

జిల్లాకు అవసరమైన 30 మెట్రిక్ టన్నుల విత్తనాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని మిగిలిన విత్తనాలను తక్షణమే కేటాయించి పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. కేవలం లక్ష్యాలు, నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలు అందుతున్నాయా లేదా అన్నది ఉన్నతాధికారులు పరిశీలించాలి. ఏలినో ప్రభావం తీవ్రతరం కాకముందే పశుగ్రాసం కొరత నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పశువులపై ఆధారపడి బతుకుతున్న రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి మిగిలిన విత్తనాలను అందిస్తారా? లేక రైతులు ఎదురుచూపుల్లోనే ఉండాల్సి వస్తుందా? అన్నది వేచి చూడాలి.

వాట్సాప్ గ్రూపుల్లో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య మాటల యుద్ధం

చోద్యం చూస్తున్న నాయకులు, అధికారులు!

రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత దూషణలు..

శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం

కామారెడ్డి గాంధారి నవంబర్ 04 (సింగిడి)



కామారెడ్డి: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కొందరు కార్యకర్తల మధ్య వాట్సాప్ గ్రూపుల్లో నిత్యం మాటల యుద్ధం కొనసాగుతోంది. మా పార్టీ గొప్పదంటే మా పార్టీ గొప్పదంటూ ఒకరిపై మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఒక పార్టీ కార్యకర్త మరో పార్టీ ఎమ్మెల్యే పనికిరాని ఎమ్మెల్యే అంటూ వ్యాఖ్యలు చేస్తుంటే, ఇంకొందరు రాష్ట్ర నాయకత్వాన్ని, జాతీయ నాయకులను లక్ష్యంగా చేసుకొని అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారు.రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, నాయకుల పనితీరుపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే విమర్శలు హద్దులు దాటి వ్యక్తిగత దూషణలు, పరస్పర కించపరిచే వ్యాఖ్యలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. వాట్సాప్ గ్రూపుల్లో జరుగుతున్న ఈ పరిణామాలను కొందరు నాయకులు, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదే పరిస్థితి కొనసాగితే సోషల్ మీడియాలో మొదలైన వాగ్వాదాలు రానున్న రోజుల్లో ప్రత్యక్ష ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ విభేదాలు వ్యక్తిగత శత్రుత్వాలుగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలివాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, బెదిరింపులు, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదుల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పోలీసు అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణపై సూచనలు చేయాలని అభిప్రాయపడుతున్నారు.అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, పోలీసు అధికారుల సమన్వయంతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్య పరిధిలోనే ఉండేలా, సామాజిక మాధ్యమాలను శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వేదికలుగా మార్చకుండా చర్యలు తీసుకోవాలి.వాట్సాప్ గ్రూపుల్లో మాటల యుద్ధానికి ఇప్పటికైనా అడ్డుకట్ట పడుతుందా? లేక నాయకులు, అధికారులు మరికొంత కాలం మౌన ప్రేక్షకులుగానే మిగిలిపోతారా? అన్నది వేచి చూడాలి.

మహిళల ఆర్థిక స్వావలంబనకు అక్షరజ్ఞానమే పునాది

ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలి.. అదే నా ఆకాంక్షమహిళలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.. సర్పంచ్‌కు మంత్రి జూపల్లి ఆదేశం ..ముందుగా చదవడం, రాయడం నేర్చుకున్న మహిళకు రూ.5 వేల నగదు బహుమతి ప్రకటన



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి):

మహిళలు అక్షరాస్యులైనప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. బుధవారం వనపర్తి జిల్లా పానగల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్పించేందుకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు గతంలోనే మంత్రి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మహిళలకు అక్షరజ్ఞానం అందించే కార్యక్రమం ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని సూచించారు.ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలకు ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇందుకోసం ఉపాధ్యాయులను నియమించాలని గ్రామ సర్పంచ్ జంబలయ్యకు ఆదేశించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణకు తన వంతు సహాయంగా మరో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.–చదువుకు వయసుతో సంబంధం లేదుచదువుకోవడానికి వయసుతో సంబంధం లేదని, ఆసక్తి, పట్టుదల ఉంటే ఎవరైనా అక్షరజ్ఞానం సాధించవచ్చని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మహిళల్లో చదువుపై ఆసక్తిని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. గ్రామంలో ముందుగా చదవడం, రాయడం నేర్చుకునే మహిళకు రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని వెల్లడించారు.

జర్నలిస్టుపై ఆర్టీసీ డ్రైవర్ దురుసు ప్రవర్తన

గోదావరిఖని, నవంబర్ 04 (సింగిడి):



ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికులకు సేవలందించాల్సిన బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఓ ఆర్టీసీ డ్రైవర్ వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. జర్నలిస్టు పాస్, గుర్తింపు కార్డు చూపించినప్పటికీ కనీస మర్యాద పాటించకుండా దురుసుగా మాట్లాడటమే కాకుండా, చివరకు బస్సు నుంచి దింపివేసిన ఘటన తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి వెళ్లేందుకు సాయంత్రం 6 గంటల సమయంలో టీజీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఎక్కిన ఓ జర్నలిస్టు తన ప్రయాణానికి సంబంధించిన పాస్‌తో పాటు ఐడీ కార్డును డ్రైవర్‌కు చూపించారు. అనంతరం దాహంగా ఉండటంతో వాటర్ బాటిల్ ఇవ్వాలని కోరారు. డ్రైవర్ అవహేళనగా మాట్లాడినట్లు బాధిత జర్నలిస్టు ఆరోపిస్తున్నారు.'మిమ్మల్ని ఉచితంగా తీసుకెళ్లడమే ఎక్కువ.. ఇంకా వాటర్ బాటిల్ కూడా ఇవ్వాలా? టికెట్ తీసుకుంటేనే వాటర్ బాటిల్ ఇస్తా.. ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ దురుసుగా సమాధానమిచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా తనను బస్సు నుంచి కిందకు దింపి బస్సును అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



జంతు జనన నియంత్రణకు అవసరమైన అన్ని సదుపాయాలు ఒకే చోట ఏర్పాటు చేయాలి

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి)

జిల్లా వ్యాప్తంగా జంతు జనన నియంత్రణ కార్యక్రమాలకు అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ ఆదేశించారుబుధవారం అదనపు కలెక్టర్ నాగవరం శివారులోని జంతు జనన నియంత్రణ కేంద్రం, డంపింగ్ యార్డును సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు.ముందుగా జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ వీధి కుక్కలకు జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న విధానం, వాటికి అందిస్తున్న వైద్య సేవలు, కేంద్రంలో ఉన్న సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, వైద్య సదుపాయాలు, ఇతర వసతులను ఒకే చోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించిన అదనపు కలెక్టర్ అక్కడ చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని, వ్యర్థాల నిర్వహణ తీరును పరిశీలించారు. చెత్త వేరు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను పద్ధతి ప్రకారం వేరు చేసి, వాటి నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. డంపింగ్ యార్డులో క్రమబద్ధమైన నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.డంపింగ్ యార్డులో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డులో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వ్యర్థాల నిల్వ, నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఏఈ ప్రశాంత్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



Editorial

ఎడిటోరియల్

దారి తప్పుతున్న లేత మనసులు

సమాజంలో రోజురోజుకూ మారుతున్న పరిస్థితులు, ముఖ్యంగా పసిపిల్లల ప్రవర్తనలో వస్తున్న హింసాత్మక మార్పులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్నటికి మొన్న హర్యానాలో మూడవ తరగతి చదివే ఒక చిన్న బాలుడు తోటి చిన్నారిపై తరగతి గదిలోనే అత్యంత క్రూరంగా దాడి చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఒక సాధారణ పాఠశాలలో, పసిప్రాయంలో పిల్లల మధ్య ఇలాంటి దాడులు జరగడం సమాజం ఎటువైపు వెళ్తుందనే భయాన్ని కలిగిస్తోంది.

కేవలం హర్యానా ఘటనే కాకుండా, దేశవ్యాప్తంగా చిన్నారుల ప్రవర్తనలో హింస పెరుగుతోందనడానికి ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. ఇటీవల కాలంలో కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయుల ముందు తోటి విద్యార్థులపై కుర్చీలు విసరడం, బల్లలతో కొట్టుకోవడం వంటి ఘటనలు కొన్ని పాఠశాలల్లో వెలుగు చూశాయి. కొద్ది నెలల క్రితం ఉత్తరప్రదేశ్‌లో ఒక పాఠశాలలో చిన్న గొడవ కారణంగా తోటి విద్యార్థిని మరో బాలుడు కత్తితో పొడిచి చంపిన దారుణ సంఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. సాయంత్రం వేళల్లో ఆటలాడుకునేటప్పుడు చిన్న విషయాలకే పిల్లలు ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడి చేసుకోవడం, పెద్దల మాదిరిగా కక్షలు పెంచుకోవడం నగరాల్లో తరచూ చూస్తున్నాము. చదువుకోవాల్సిన వయసులో, తోటివారితో ఆడుకోవాల్సిన ప్రాయంలో పిల్లలు ఇలా రాక్షసంగా ప్రవర్తించడానికి గల కారణాలు ఏమిటి? దీనికి బాధ్యులు ఎవరు? అనే విషయాలపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

చిన్నపిల్లలు ఇలా ప్రవర్తించడానికి ప్రధాన కారణాలు



పిల్లలు స్వతహాగా హింసా ప్రవృత్తితో పుట్టరు. సమాజంలో, కుటుంబంలో జరిగే పరిణామాలే వారి మనసులను విషపూరితం చేస్తున్నాయి.

ఈ రోజుల్లో తల్లిదండ్రులు తమ పనుల నిమిత్తం పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇస్తున్నారు. అందులో పిల్లలు ఆడే డెత్ అండ్ సర్వైవల్ "ఎలాగైనా సరే నువ్వు బతకాలంటే అవతలి వాడిని చంపాలి", 'పబ్జీ', 'ఫ్రీ ఫైర్' వంటి భయంకరమైన ఆన్‌లైన్ ఆటలు వారి మెదళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎవరినైనా చంపడం, కొట్టడం గేమ్‌లలో సాధారణం కావడంతో, అదే నిజ జీవితంలోనూ చేయవచ్చనే భ్రమలో పడుతున్నారు.

ఉరుకుల పరుగుల జీవితంలో నేటి తల్లిదండ్రులకు పిల్లలతో గడపడానికి సమయం దొరకడం లేదు. పిల్లలు ఏం చేస్తున్నారు? ఎవరితో తిరుగుతున్నారు? మొబైల్‌లో ఏం చూస్తున్నారు? అనే విషయాలపై కనీస పర్యవేక్షణ కొరవడింది. కేవలం భౌతిక అవసరాలు తీర్చడమే బాధ్యతగా భావిస్తున్నారు కానీ, వారి మానసిక స్థితిని గమనించడం లేదు.

గతంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులంటే ఒక గౌరవం, కొద్దిపాటి భయం ఉండేది. తప్పు చేస్తే మందలిస్తారనే సదుద్దేశంతో పిల్లలు అదుపులో ఉండేవారు. కానీ నేడు చట్టాల పేరుతో, ఆధునిక ధోరణుల పేరుతో ఉపాధ్యాయులు పిల్లలను మందలించే స్వేచ్ఛను కోల్పోయారు. దీంతో పిల్లల్లో గురువుల పట్ల భయంపోయి, విచ్చలవిడితనం పెరిగిపోతోంది. ఇంట్లో తల్లిదండ్రులు తరచూ గొడవ పడటం, టీవీల్లో లేదా ఓటీటీల్లో వచ్చే హింసాత్మక చిత్రాలను పిల్లల ముందే చూడటం వంటివి పిల్లల మనసులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పెద్దలు చేసే ప్రతి పనీ పిల్లలు గుడ్డిగా అనుసరిస్తారు.

సన్మార్గంలో పెట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు

ఈ దుస్థితిని మార్చడానికి కేవలం ప్రభుత్వాలు లేదా పాఠశాలలు మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

చిన్న వయసులో పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి. ఒకవేళ ఆన్‌లైన్ చదువులకోసం ఇస్తే, పెద్దల పర్యవేక్షణలోనే అది జరగాలి. డిజిటల్ వ్యసనం నుంచి వారిని బయటపడేయాలి.

తల్లిదండ్రులు తమ బిజీ షెడ్యూల్ నుండి రోజులో కొంత సమయాన్ని కేటాయించి పిల్లలతో మాట్లాడాలి. వారి మనసులో ఏముంది? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆప్యాయంగా అడిగి తెలుసుకోవాలి. వారిలో మంచి, చెడుల విచక్షణను చిన్ననాటి నుంచే నేర్పించాలి. కేవలం మార్కుల కోసమే చదువు కాకుండా, తోటివారిని ప్రేమించడం, గౌరవించడం వంటి నైతిక విలువలను పాఠశాల సిలబస్‌లో భాగం చేయాలి. కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి మానసిక సమస్యలతో బాధపడే పిల్లలకు తగిన సూచనలు అందించాలి. పిల్లలు తప్పు చేస్తే వెంటనే కోప్పడటం కంటే, వారి తప్పును ప్రేమగా వివరించి చెప్పాలి. సమాజంలో ఇతరులతో ఎలా ప్రవర్తించాలో ఆచరణపూర్వకంగా నేర్పించాలి.

చివరిగా, చిన్నారుల మనసులు తెల్ల కాగితం లాంటివి. వాటిపై మనం ఏది రాస్తే అదే నిలిచిపోతుంది. నేడు హర్యానాలో జరిగిన ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. ఇప్పటికైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మేల్కొని పిల్లల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టకపోతే, భవిష్యత్తులో ఈ సమాజం మరింత ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పసి హృదయాలలో హింసకు బదులుగా ప్రేమ, కరుణ వికసించేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది.

-కందుకూరి రాకేష్
9100642346

సాహితీ మహారథి దాశరథి

నవంబర్ 5 దాశరథి వర్ధంతి

"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాడు /నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు.



తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనందించిన కవి దాశరథి.

దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు.

నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్'

అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి.

" అగ్నిధారను తన జైలు సహవాసి.. వట్టికోట ఆళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు.

రుద్రవీణ, మహాంధ్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం). మస్తిష్కంలో లేబరేటరీ (విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది -- దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో పచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/నీ వెంట లోకాలు గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన.

అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు... అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు.

తీగెలను తెంపి అగ్నిలో దింపినావు /నా తెలంగాణ కోటి రత్నాల వీణ."
(అగ్నిధార)

ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి.... తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే".

కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును.."అనాదిగా సాగుతోంది -- అనంత సంగ్రామం / అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య". ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి /ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి"...గతాన్ని కాదనలేను -- వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను -- కాలం నాకంఠమాల"...

హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను /శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

తెలంగాణ విముక్తి కోసం జీవితాంతం పోరాడిన నల్ల నరసింహులు

నేడు నరసింహులు వర్ధంతి

1945 దశకంలో పెను ఉప్పెనై పోటెత్తిన తెలంగాణ సాయుధ విముక్తి పోరాట కెరటాల్లో ఒక ఉత్తుంగ తరంగమై విప్లవించాడు నల్లా నరసింహులు. 1945 నుండి 1951 వరకు నిజాం ప్రభుత్వ దన్నుతో రజాకార్లు దేశముఖ్ లు, సర్దేశ్ ముఖ్ లు, దేశాయిలు, సర్ దేశాయిలు, జమీన్దార్లు, తెలంగాణ ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక అణచివేత, హత్యాకాండ, దోపిడికి వ్యతిరేకంగా, జరిపిన ప్రసిద్ధి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సందర్భంలో జనగామ ప్రాంత దళ నాయకత్వం వహించిన పోరాట యోధుడు ఆయన. నాడు నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిజాం తరుపున పన్నులు వసూలు చేసే అప్రత్యక్ష అధికారాన్ని చేజిక్కించుకున్నారు కొందరు భూస్వాములు. లక్షల, వేల కొద్ది ఎకరాల భూమిని తమ స్వాధీనంలో పెట్టుకొగా, ఆ భూములను సాగుచేసి పండించే రైతులు మాత్రం కొలుదార్లే, కూలీలై, పెట్టి బానిసలై బతుకుల నీడుస్తున్న దయనీయ కాలంలో చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపు దిద్దుకుంది. దానికి నాయకత్వం వహించిన 'ఆంధ్ర మహాసభ' లో అత్యంత కీలక పాత్ర వహించి వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ వీరోచిత విముక్తి పోరాటంలో



ఎన్నో త్యాగాలు చేసి చేసి, ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి, చిత్ర హింసలకు గురై, కేసుల పాలై, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి, ధైర్యంగా తన వాదనలను వినిపించి తెలంగాణ టైగర్' అని కీర్తించబడ్డ అసామాన్య వీరకిశోరం నల్ల నరసింహులు.

భారత స్వాతంత్ర్యం, హైదరాబాద్ విలీనం సందర్భాల మధ్య కాలంలో జరిగిన వేలాది మంది మరణాలకు, ఊచ కోతలకు, మాన భంగాలకు, హత్యలకు పైశాచిక హింసకు సాక్షమై నిలిచిన సంధి సమయాన్ని చారిత్రాత్మక 10 లక్షల ఎకరాల భూ విముక్తి తర్వాత దాన్ని పేదలకు పంచిన ప్రజా విజయ ఘటనకు ప్రతీకగా నిలిచిన వాడు నల్ల నరసింహులు.

నరసింహులు గ్రామం కడవెండి. అతి మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవాడు. దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా.. ఏండ్లకు ఏండ్లు అజ్ఞాతంలో ఉంటూ విప్లవించిన సాయుధ యోధుడు ఆయన.

తెలంగాణ ప్రాంతం భూస్వాముల, నిజాం తాబేదార్ల ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న సందర్భంలో ఆంధ్ర మహాసభ రూపంలో కమ్యూనిస్ట కార్యక్రమ వేదిక ఒక కొత్త పరిస్థతి తెచ్చింది. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, నైతిక విలువలతో, మానవత్వంతో తమకున్న ఆస్తులను ప్రజల పరం చేశారు. గ్రామీణ తెలంగాణను సంఘటిత పరుస్తూ భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామ దళ నిర్మాణం చేపట్టారు.

అలా జనగామ తాలూకాలోని ఎన్నో గ్రామాల్లో దళాలను నిర్మించి, స్వయంగా నాయకత్వం వహించి పార్టీ అగ్ర నాయకుల సమన్వయం తో విప్లవించిన కొదమ సింహం నరసింహులు. అటు భూస్వాములకు, ఇటు రజాకార్లకూ సింహ స్వప్నమై నిద్రలేకుండా చేశాడు. మొట్టమొదటి తిరుగు బాటు తన స్వంత ఊరు నుండే మొదలు పెట్టి 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దోపిడి దారులైన భూస్వాములను తరిమికొట్టేందుకు 'సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చాడు.

ఆ పిలుపు యుద్ధ భేరీగా మారి, తెలంగాణ నేల నాలుగు చెరగులా ప్రత్యేకించి భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకు పోయిన నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాలలో ఎర్ర జెండాల నీడలో లక్షలాది మంది నిరక్షరాస్య సుశిక్షత ప్రజాసైన్యం ఎక్కడిక్కడ గడీలపై, ఖాసీం రజ్వీ నాయకత్వంలో పని చేసే రజాకార నిజాం పోలీస్ క్యాంప్లపై మెరుపు దాడులు చేస్తూ ముందుకు సాగింది. వేలకొద్ది ఎకరాల భూములను విముక్తం చేస్తూ, బహిరంగంగానే దున్నే వాడికే భూమిని పంచిపెడ్తూ, వందలు వేలమంది కర్కశ నిజాం సైన్యాలకు, రజాకార్లకూ బలై ప్రాణాలను కోల్పోతూ 1951 వరకు కొనసాగింది.

పోరాట దళాలలను, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి, నాయకత్వం వహించి, కడన రంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు పట్టుబడి చిత్ర హింసలను సహించి, అనేక కేసుల్లో ఇరికించబడి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి అజేయంగా నిలిచిన ధీరుడు నల్లా నరసింహులు.

పోలీస్ చర్య అనంతరం యూనియన్ సైన్యాలు నిషిద్ధ కమ్యూనిస్ట్ సభ్యులను అదవుల్లోకి తరుముతూన్న సందర్భంగా, పట్టు బడి, ఉరి శిక్ష విధించ బడగా, అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళన ఫలితంగా ఉరితీతకు 12 గంటల ముందు ఉరిశిక్ష నిలిపివేయబడడం విశేషం.

ఇంతకూ నల్లా నరసింహులు ఎవరు ? అని నాటి యూనియన్ సైనిక జనరల్ జె.ఎన్. చౌదరి నల్లగొండ జైలుకు చూడ్డానికి వచ్చినప్పుడు ఆ జిల్లా ఎస్.పి. ధన్ రాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహులు "టైగర్ ఆఫ్ తెలంగాణ" అని పరిచయం చేయడం గమనార్హం.

నెహ్రూ ప్రభుత్వాన్ని కూల దోయడానికి ప్రయత్నిస్తున్నారని స్టేట్ కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు నివేదికల వల్ల నిషేధానికి గురై, అజ్ఞాత నాయకులను లొంగి పోవాల్సిందిగా హెచ్చరించిన నేపథ్యంలో నరసింహులు వంటి అనేక మంది యోధులు జనావాసాలను వీడి, నల్లమల్ల,రాచకొండ అరణ్యాల్లోకి నిష్క్రమించగా, చివరికి విచిత్రమైన పరిస్థితుల్లో 1951 అక్టోబర్ లో 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తున్నట్టుగా కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన వెలువడడం ద్వారా ఉద్యమం అనూహ్యంగా చల్లారి పోయింది.

భారత దేశంలో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైన తరువాత కూడా అనేక కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి చివరికి అప్పటి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరిశిక్ష నుండి బయటపడి, అంతిమంగా 1959 జనవరి 26న స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చాడు నరసింహులు.

పోరాట స్మృతులతో తన ధర్మపత్ని వజ్రమ్మ తో కలసి చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వేలాది వీరులను, పిడిత ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమి పంపక విజయాలనూ స్మరించుకుంటూ... తృప్తితో జీవితాన్ని నమ్మిన సిద్ధాంతం కోసమే దారబోసి, త్యాగ ధనునిగా నరసింహులు 1993 నవంబర్ 5న ఈ లోకం వదిలి వెళ్లాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల
, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

హనుమ పాత్రలో సజీవుడు జనార్ధన్ రావు



అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 – నవంబర్ 4, 2007)ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. ఆయన ఎక్కువగా పౌరాణిక చిత్రాలలో హనుమంతుడు వేషంతో మంచిపేరు సంపాదించుకున్నాడు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన నటన ఉండేది.అర్జా జనార్ధన రావు1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955)గా ఎన్నిక చేసింది. ఇతడు శబ్దగ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్ట్‌గా పనిచేశాడు.లవకుశ (1963); శ్రీకృష్ణావతారం (1967); వీరాంజనేయ (1968); శ్రీ రామాంజనేయ యుద్ధం (1974);ముత్యాల ముగ్గు (1975);శంకరా భరణం (1979); త్యాగయ్య (1981); శ్రీ ఆంజనేయ చరిత్ర (1981); దేవాంతకుడు (1984); తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభా వాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్టూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్.మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయకుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం. బాపు-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజనేయ యుద్ధం.

....రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

లింగంపల్లి కుర్దును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట నవంబర్ 04 (సింగిడి)







ఆదర్శ గ్రామ నిర్మాణంఉపాధి హామీ పనుల్లో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన వన శాఖ అధికారి జ్యోతి, సర్పంచ్ ప్రత్యూష సాయిరాం, ఉపసర్పంచ్ కుమ్మరి సంతోష్ కుమార్, తహసీల్దార్, ఎంపీడీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెడల్పు, 1.8 మీటర్ల లోతుతో నిర్మించే ఇంకుడు గుంతకు సుమారు రూ.6,500 ఖర్చవుతుందని వివరించారు.ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలిఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు రబీ సీజన్‌లో వరి సాగుపైనే ఆధారపడకుండా జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలన్నారు. కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.జిల్లాలో జొన్నల సాగుకు అవసరమైన విత్తనాల పరిమితిని 8 క్వింటాళ్లకు పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు.విద్యార్థుల ప్రదర్శనలకు కలెక్టర్ ప్రశంసలు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యరూపకాలు, పాటలను కలెక్టర్ తిలకించి అభినందించారు. చిన్న వయస్సు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు సైతం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించాలని సూచించారు.చెరువుకట్టపై మొక్కల పెంపకం.. సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలుగ్రామ చెరువుకట్టను సందర్శించిన కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులు తీసుకోవాలని సూచించారు. చెరువు కట్ట ఆవరణలో సౌర విద్యుత్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొక్క నాటి సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రజల భాగస్వామ్యంతోనే

సోలార్ ప్లాంట్ గ్రిడ్ అనుసంధానం విజయవంతం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి):



పెద్దపల్లి జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 1 మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో జరిగిన సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు

సహకార సంఘాల ఆధ్వర్యంలో ఒక్కొక్కటి 1 మెగావాట్ సామర్థ్యంతో మొత్తం 4 సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా తెలంగాణ రాష్ట్రంలోనే పెద్దపల్లి గుర్తింపు పొందడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతిరోజూ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, వీటి ఏర్పాటుకు సహకరించిన అధికారులు, పిఏసిఎస్ నాయకులు, సిబ్బంది కృషిని అభినందించారు.

వచ్చే వారంలో అధికారిక ప్రారంభోత్సవం

సింక్రనైజేషన్ పూర్తయిన నేపథ్యంలో ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. వచ్చే వారం ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుల సమయం తీసుకుని రాఘవాపూర్ లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

బోధనలో కృత్రిమ మేధస్సుతో కొత్త ఆవిష్కరణలు

కరీంనగర్, నవంబర్ 4(సింగిడి):



కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో బోధనను మరింత సులభతరం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించవచ్చని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి సి. పార్థసారథి అన్నారు.జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 98 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 330 మంది గణితం, భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఏఐపై అవగాహన పెంచుకుని, ఆధునిక బోధనా పద్ధతులను విద్యార్థులకు అందించాలని పార్థసారథి సూచించారు.కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయులు దాన్ని బోధనలో సమర్థంగా వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు గ్రామీణ విద్యార్థులకూ ఈ సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, విద్యాశాఖ, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి అధికారులు పాల్గొన్నారు.

నేడు నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

★హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
★రూ.17.50 ఓట్లతో సమీకృత మండల స్థాయి కార్యాలయాలకు శంకుస్థాపన
★రూ.13 కోట్లతోకతాల్ గూడనుంచి రాజీవ్ స్వగృహ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

(ఉమ్మడి నల్గొండ బ్యూరో)
నవంబర్4 (సింగిడి)

రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం నల్గొండ జిల్లా కేంద్రానికి చేరుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేయనున్నారు.ఉదయం 10:00 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం(ఇందిరా భవన్) చేరుకుంటారు.ఉదయం 10:45 కు నల్గొండ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియమితులైన బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు.అదేవిధంగా ఉదయం 11.00 గంటలకు నల్గొండలో 17.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించే సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేస్తారు.అనంతరం



ఉదయం 11:15 గంటలకు మామిళ్ల గూడ మీదుగా కతాల్‌గూడ నుండి రాజీవ్ స్వగృహ రహదారిని అభివృద్ధికి సంబంధించిన పనులకు సుమారు రూ. 13 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేయనున్నారు.మధ్యాహ్నం 3గంటలకు కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు డా.బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ చేరుకుంటారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి
ఉమ్మడి నల్గొండ బ్యూరో
నవంబర్ 4 (సింగిడి)

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని , ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. మీకు ఇష్టమైన సబ్జెక్టులు ఏవి? భవిష్యత్తులో ఏం చదవాలనుకుంటున్నారని ? పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.అనంతరం పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఈ రోజు విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా రెవిన్యూ, మైనారిటీ అధికారి జయమ్మ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కందకం తీసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 04 (సింగిడి)

ఏఐఎఫ్ టి యు న్యూ ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ముందు చంద్రంపేట చౌరస్తా నుండి మొదటి బైపాస్ ను కలిపే రోడ్డుకు అడ్డంగా కందకం తీసిన వ్యాపారి చేపూరి బుచ్చయ్య పై చర్యలు తీసుకోవాలని నిరసన తెలుపడం జరిగింది . ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ చంద్రంపేట చౌరస్తా నుంచి మొదటి బైపాస్ ను కలిపి రోడ్డు పనులకు మరియు చంద్రంపేట చౌరస్తా అభివృద్ధికి ఒక కోటి 80 లక్షల రూపాయలు మంజూరై సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు అధికారులు ఎలాంటి పనులు ప్రారంభించలేదు దీనివలన వంద ఫీట్ల రోడ్డును భూ ఆక్రమదారులు ఏదేచ్ఛగా భూమిని ఆక్రమిస్తూ ఉన్నారు చేపూరి బుచ్చ య్య లాంటి వ్యాపారి ఏకంగా రోడ్డుకు అడ్డంగా కందకమే తీసి ఉన్నారు ఈ కందకం వలన నడక దారిన వెళ్లే ప్రజలకు పశువులకు తీవ్ర ఇబ్బంది కలుగుతూ అతి ప్రమాదకరంగా ఈ కందకం ఉన్నది ఈ వ్యాపారి హెచ్ పి పెట్రోల్ పంపు పక్కన పంజాబ్ నేషనల్ బ్యాంక్ బిల్డింగును శాంతి నగర్ రోడ్డుకు అడ్డంగా కట్టి అక్కడ కూడా ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తూ ఉన్నాడు ఈయన ప్రజలకు ఆటంకం కలిగించే పనులు ఎన్ని చేస్తున్న ప్రభుత్వ అధికారులు కానీ రాజకీయ నాయకులు గానీ అడ్డు చెప్పకుండా ఆయన విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడి తమ కర్తవ్యాన్ని విస్మరిస్తూ ఉన్నారు . చేపూరి బుచ్చయ్య చేష్టలతో ఆ కందకములో ఎవరైనా పడి ప్రమాదం జరిగితే దానికి మున్సిపల్ అధికారులే పూర్తి బాధ్యత వహించాలి ఆ బుచ్చయ్య ఇంటి ముందు మున్సిపల్ కార్యాలయం ముందు బాధితులతో తీవ్ర ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తూ ఉన్నాం . మీరు చేపూరి బుచ్చయ్య తీసిన కందకాన్ని పూడ్చనట్టు అయితే మీరు తీసిన కొత్తచెరువు కాలువను మేము పూడ్చుతాం అని చెప్పి హెచ్చరిస్తున్నాం . కొత్తచెరువు నాలాకు భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరగాలంటే నాలా వెంబడి ప్రతిపాదిత రోడ్డును పూర్తి చేయాలి . లేనిపక్షంలో త్వరలో సుదీర్ఘ పోరాట షెడ్యూల్ ప్రకటిస్తాం తీవ్ర ఆందోళన చేస్తామని చెప్పి హెచ్చరిస్తున్నాం . ఇంకా ఈ కార్యక్రమంలో ఎర్రజెండా బీడీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కామ్రేడ్ మచ్చ అనసూయ, ఎర్రజెండా పవర్లూమ్ కార్మిక సంఘం కన్వీనర్ గుజ్జ దేవదాస్, కొండ శ్యామ్, ఆకన సత్తయ్య పంతం సుజాత, గడదాసు లతా, కొనవేని భారత ఇంకా తదితరులు పాల్గొని ఉన్నారు.

23 వ రోజు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి)

తెలంగాణ లో జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత, క్రమ బద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం వంటి డిమాండ్ల నెరవేర్పు కోసం ఉద్యోగులు శాంతియుతం గా ఆందోళన కొనసాగిస్తున్నారు. అంబేద్కర్ సంఘాల మద్దతుతో సందర్భం గా అంబేద్కర్ సంఘాల నాయకులు, కార్యకర్తలు సమ్మె వేదికకు చేరుకుని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఘన సంఘీభావం తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థకు అంకితభావంతో సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఉద్యోగులకు అండగా నిలబడ తామని వారు భరోసా ఇచ్చారు.యముడి వేషంలో ప్రత్యేక నిరసన,ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉద్యోగులు యముడి చిత్రరూపంలో వేషధారణతో ప్రత్యేక నిరసన నిర్వహించారు. తమ డిమాండ్లపై తక్షణ స్పందన అందించాలని ప్రభుత్వానికి స్పష్టంగా డిమాండ్ చేశారు. ఈ వినూత్న నిరసనతో ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాలని ఉద్యోగులు భావించారు.ఉద్యోగుల డిమాండ్లుదీర్ఘకాలం గా సేవలం దిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కల్పించాలి.కుటుంబ భద్రత, సామాజిక భద్రత వంటి సేవా హక్కులు అమలు చేయాలి.సమ్మె కొనసాగిస్తామంటున్న ఉద్యోగులు,ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు స్పష్టం చేశారు. కోవిడ్ కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన ఉద్యోగుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలని వారు కోరుతున్నారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులతో పాటు వివిధ వైద్య విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

దళిత బంధు పథకంలో అవినీతిపై ఏసీబీ విచారణ జరిపించాలి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 04(సింగిడి)



నిజాంసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో దళిత బంధు పథకం అమలులో అవినీతి జరిగిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ టీఆర్ఎస్ పార్టీ దళిత విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ పోలీస్ ఉద్యమకారుడు ఎం. సంజీవ్ మాదిగ హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీకి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా సంజీవ్ మాదిగ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దళిత బంధు పథకంలో అవినీతి జరిగిందని ఆరోపించారని, అయితే నిజాంసాగర్ ప్రాంత దళితుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే గత మూడు సంవత్సరాలుగా ఈ అంశంపై ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. అవినీతి జరిగిందని ఆరోపణలు చేసినప్పుడు వాటిపై విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.దళిత బంధు పథకంలో అవినీతి జరిగిందనే ఆరోపణలపై తాను ఏసీబీకి ఫిర్యాదు చేశానని, విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం తప్పకుండా పోరాటం చేస్తానని తెలిపారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందుకు తీసుకొస్తామని సంజీవ్ మాదిగ పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, ప్రజలు తమ పోరాటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో మరిన్ని అంశాలను ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకొస్తామని సంజీవ్ మాదిగ వెల్లడించారు.

భవన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డులు పొందాలి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 4(సింగిడి)

భవన నిర్మాణ రంగంలో నిజాయితీగా పని చేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మర్ల సాయిబాబు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు లేబర్ కార్డు దరఖాస్తు పత్రాలను ఆయన అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 1996లో రూపొందించిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం ద్వారా కార్మికులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిజమైన కార్మికులందరూ ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాలని పేర్కొన్నారు.కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 55 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.5 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుడు జీవించి ఉన్నంతకాలం లేబర్ కార్డు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భవన నిర్మాణ పనుల్లో పనిచేసిన తాపీ మేస్త్రీ పేరును శిలాఫలకాలపై పొందుపరచాలని, కార్మికులకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల సబ్సిడీ అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంలో కష్టపడి పనిచేసే కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందినప్పుడే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మహామేస్త్రి మర్ల సాయిబాబుతోపాటు నిజమైన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ మేస్త్రీలు నాగేష్, రవి, సంగమేశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీని అభినందించిన సీపీ

సిద్దిపేట, నవంబర్ 4(సింగిడి)

ఈ సంవత్సరంలో మొత్తం 16 వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా ప్రతిభ కనబరిచిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు గారిని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించి, సత్కరించారు.ఈ 16 కేసుల్లో 13 కేసులలో నిందితులకు 20 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడేలా ప్రాసిక్యూషన్ విజయవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు విచారణ సమయంలో పక్కా ఆధారాలు సమర్పించి, సమర్థవంతమైన వాదనలు వినిపించి తీవ్ర నేరాలకు పాల్పడిన నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో సాదుల ఆత్మారాములు గారు చూపిన చొరవ, నిబద్ధతను సీపీ ప్రత్యేకంగా కొనియాడారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడంలో ప్రాసిక్యూటర్ పాత్ర అత్యంత కీలకమైనదని, ఆత్మారాములు గారి సేవలు పోలీస్ సిబ్బందికి మరియు ప్రాసిక్యూషన్ విభాగానికి ఆదర్శనీయమని సీపీ తెలిపారు. సాదుల ఆత్మారాములుకి శాలువా కప్పి, మెమంటో అందించి సత్కరించారు.

రుణాల వసూళ్లకు ఒత్తిడి చేయొద్దు

కరీంనగర్, నవంబర్ 4(సింగిడి)

జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులపై రుణ వాయిదాల చెల్లింపునకు ఒత్తిడి చేయకుండా, పంట రుణాలను పునర్వ్యవస్థీకరించి ఆర్థిక ఉపశమనం కల్పించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీలో బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. కరువు మండలాలుగా గుర్తించిన కరీంనగర్ పట్టణ, గ్రామీణ, హుజూరాబాద్ మండలాల్లో అర్హులైన రైతుల రుణాలను 36 నెలల కాలపరిమితితో మధ్యకాలిక రుణాలుగా మార్చాలని సూచించారు. కొత్త రుణాలు మంజూరు చేసి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలన్నారు.స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు అనుసంధాన రుణాలు అందించాలని, అర్హులకు వ్యవసాయ అనుబంధ రంగాల రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఆర్థిక సమ్మిళిత ప్రచారంలో ప్రజలు పాల్గొని బ్యాంకింగ్, బీమా, పింఛను సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎల్లమ్మ సిద్దోగం కు కేటీఆర్‌కు ఆహ్వానం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 04 (సింగిడి):



జిల్లా ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం సభ్యులు గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లి సిద్దోగ కార్యక్రమానికి రావాల్సిందిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఎల్లమ్మ తల్లి ప్రతిమతో పాటు గౌడ సంప్రదాయానికి ప్రతీక అయిన గడను తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా ఆహ్వానం అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీసీ పరశురాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ భవన నిర్మాణానికి స్థలం గుర్తింపు

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి):

పెద్దమందడి మండలంమనిగిల్ల గ్రామంలో బుధవారం సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో రెండు వీవోలు, సుమారు 52 మహిళా సంఘాలు ఉన్నప్పటికీ సమావేశాల నిర్వహణకు సరైన భవనం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించి గ్రామసభలో తీర్మానం చేశారు.అలాగే వి బి జి రామ్ జీ పథకం ద్వారా సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు మంజూరు చేయాలని ఎంపీడీవో పరిణతకు గ్రామ తీర్మాన పత్రాన్ని అందజేసి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సుమారు 700 జాబ్ కార్డులు ఉండగా వేసవిలో రోజుకు 200 మంది వరకు ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ మహిళా సాధికారత, అక్షరాస్యత, ఆరోగ్యం, బాల్యవివాహాల నివారణపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ తీర్మానం చేసినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీ, వార్డు సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, జయమ్మ, మహిళా సంఘం కోశాధికారి శ్రావణి, శిరీష, సావిత్రి, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కార్పొరేటర్ అధికారాల్లో భర్త జోక్యం తగదు

కరీంనగర్, నవంబర్4(సింగిడి)



కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని బీజేపీ నాయకురాలు బండారి గాయత్రీ ఆరోపించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 9వ డివిజన్ నుంచి ఎన్నికైన కార్పొరేటర్ పడిశెట్టి వసంతలక్ష్మి స్థానంలో ఆమె భర్త పడిశెట్టి భూమయ్య కార్పొరేటర్‌గా చెలామణి అవుతూ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు.ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ఉన్నతాధికారులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయని భూమయ్య తనను తాను కార్పొరేటర్‌గా ప్రచారం చేసుకుంటూ, అధికారులకు ఆదేశాలు జారీ చేయడం, నగరపాలక సంస్థ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం చట్ట విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.భూమయ్యను కార్పొరేటర్‌గా గుర్తించకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, పాలనా వ్యవహారాల్లో ఆయన అనధికార జోక్యాన్ని అరికట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గాయత్రీ డిమాండ్ చేశారు.

తిరుపతిరావుకు టీఎన్జీవోల శుభాకాంక్షలు

కరీంనగర్, నవంబర్4(సింగిడి)

జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతిరావును టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఆధ్వర్యంలో నాయకులు తిరుపతిరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, సంఘం వార్షిక డైరీ అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం, పరస్పర సమన్వయంపై చర్చించి, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో సంఘం నాయకులు సర్దార్ హర్మిందర్ సింగ్, రాగి శ్రీనివాస్, రాజేష్ భరద్వాజ్, లవకుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆనవాళ్లపై కూల్చివేత రాజకీయాలా?

రామగుండం ప్రగతికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను ధ్వంసం చేయడం అప్రజాస్వామిక చర్య..కూల్చిన పైలాన్‌ను వెంటనే పునర్నిర్మించాలి మాజీ ఎమ్మెల్యే చందర్ డిమాండ్



గోదావరిఖని, నవంబర్ 4 (సింగిడి):

రామగుండం అభివృద్ధికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను కూల్చివేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా మండిపడ్డారు. ఒక నిర్మాణాన్ని నేలమట్టం చేసినంత మాత్రాన గతంలో జరిగిన అభివృద్ధిని, ప్రజల మనసుల్లో నిలిచిన జ్ఞాపకాలను చెరిపివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను కొనసాగించాల్సిన పాలకులు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేయడంపై దృష్టి పెట్టడం విచారకరమని విమర్శించారు.బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించామని తెలిపారు. నగరంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడం, కాలనీలు, గల్లీల్లో రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించినట్లు గుర్తుచేశారు.ప్రజాధనంతో నిర్మించిన అభివృద్ధి కట్టడాలు ఏ ఒక్క పార్టీకి సంబంధించినవి కావని, అవి ప్రజల ఆస్తులని చందర్ పేర్కొన్నారు. గత పాలకులు చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా నిలిచే నిర్మాణాలను తొలగించడం వల్ల భవిష్యత్ తరాలకు ఆ కాలంలో జరిగిన ప్రగతి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉంటే అంతకంటే మెరుగైన పనులు చేపట్టి ప్రజలకు చూపించాలని సవాల్ విసిరారు.పైలాన్ కూల్చివేత సమయంలో తాము శాంతియుతంగా నిరసన తెలిపి, జేసీబీలను నిలిపివేయాలని కోరినా పోలీసులు స్పందించలేదని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన పోలీసులు వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. పోలీసుల చర్యలు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే అభిప్రాయం ప్రజల్లో కలిగిస్తున్నాయని విమర్శించారు.రామగుండం ప్రాంతానికి ప్రస్తుత పాలకులు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం, గత ప్రభుత్వ అభివృద్ధి గుర్తులను తొలగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, సంబంధిత అధికారులు ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని సూచించారు. ప్రజలు, కార్మికులు, డ్రైవర్లు ఈ పరిణామాలను గమనిస్తున్నారని, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.రామగుండం అభివృద్ధి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పైలాన్‌ను తక్షణమే పునర్నిర్మించాలని చందర్ డిమాండ్ చేశారు. కూల్చివేతలతో కాకుండా నిర్మాణాత్మక అభివృద్ధి పనులతో ప్రజల మన్ననలు పొందాలని పాలకులకు హితవు పలికారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి, ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి



.అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్జిల్లా ఎస్పీ మహేష్ బి గితె, వివిధ శాఖల అధికారులు జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 04 (సింగిడి)ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఇటీవల నియామకమైన నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఇంచార్జి జిల్లా ఎస్పీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి , ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ట్రైబల్ వెల్ఫేర్, మత్స్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల సహకారంతో జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా, అలాగే వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద ఇప్పటి వరకు రూ.1, 81,57,500 పరిహారం అందించామని వెల్లడించారు. ప్రతి నెలా చివరి రోజున అన్ని మండలాల్లో ఆయా శాఖల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, ఉపకార వేతనం, విదేశీ విద్యా, వివిధ ప్రభుత్వ సబ్సిడీ, ఉపాధి కల్పన పథకాలలపై సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎస్పీ మహేష్ బి గితె మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.నరేష్ నాయక్, బీపేట రాజు, భూక్య రమేష్, బడుగు లింగయ్య, జోగు రవీందర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోట లహరి, వీర రమణయ్య, చింతోజు భాస్కర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత రైతులకు ఉపశమన చర్యలు అమలు చేయాలి



కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 04 (సింగిడి)

కామారెడ్డి జిల్లాలో కరువు ప్రభావిత మండలాల రైతులకు బ్యాంకుల ద్వారా రుణ ఉపశమన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ (విపత్తు నిర్వహణ–II) శాఖ జారీ చేసిన జీవో నంబర్ 03, తేదీ 24.10.2026 ప్రకారం కరువు ప్రభావిత ప్రాంతాల రైతులకు అందించాల్సిన బ్యాంకింగ్ సంబంధిత ఉపశమన చర్యలపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జుక్కల్, పెద్ద కొడప్గల్, సదాశివనగర్, మద్నూర్ (మొహమ్మద్‌నగర్) మండలాలను మధ్యస్థ తీవ్రతతో కూడిన కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో అర్హులైన రైతులకు పంట రుణాలు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణాల రీషెడ్యూలింగ్, మారటోరియం తదితర వర్తించే ఉపశమన సదుపాయాలను నిబంధనల ప్రకారం కల్పించాలని సూచించారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.రైతులు కేవలం వరి సాగుపైనే ఆధారపడకుండా నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య సంపద, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం వంటి అనుబంధ రంగాలను ప్రోత్సహించాలని, వీటికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని బ్యాంకులు అందించాలని సూచించారు.రుణమాఫీ, రుణాల రీషెడ్యూలింగ్, రుణాల పునర్వ్యవస్థీకరణ మధ్య ఉన్న తేడాలను రైతులకు వివరించాలని, అదనపు రుణ సదుపాయాలు, పంటల బీమా పథకాలపై అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులకు ఆర్థిక సహాయం అందేలా బ్యాంకులు, వ్యవసాయ, పశుసంవర్ధక ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎల్ డీఎం, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి, ఆర్‌బీఐ ఎల్‌డీఓ, వివిధ బ్యాంకుల నియంత్రణ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి, పశుసంవర్ధక శాఖ అధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి
ఉమ్మడి నల్గొండ బ్యూరో
నవంబర్ 4 (సింగిడి)



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మునగ సాగు, గృహ నిర్మాణ పథకం రెండో విడత మంజూరీలు, వి బిజీ రాంజీ పథకం అమలుపై బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. మునగ సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.అలాగే గృహ నిర్మాణ పథకం రెండో విడతలో ఇళ్ల మంజూరీకి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాలు, పురోగతి, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా ప్రారంభమయ్యేలా, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. మండలాలలో అర్హులు అయినా రూఫ్ రీప్లేసెమెంట్ లబ్ధిదారులు గుర్తించి జాబితాలను గెజిటెడ్ ఆఫీసర్ వచ్చి వెరిఫికేషన్ చేపించి పంపించగలరు. ఇందిరమ్మ ఇండ్ల లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.వి బి జి రాంజీ పథకం కింద చేపట్టాల్సిన పనులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనుల గుర్తింపు, పనుల అమలు, పురోగతిపై సమీక్షించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కూలీల సంఖ్య ను పెరిగే లా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య లు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు అంగన్వాడీ, వీవో, గ్రామపంచాయతీ, స్కూల్ కాంపౌండ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి వ్యవసాయ అధికారి రమణా రెడ్డి , హౌసింగ్ పీడీ అలివేలు , డీహెచ్ఎస్ఓ, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఓలు, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల అమలులో సమన్వయంతో పని చేయాలి

మహిళా సంఘాల బలోపేతానికి, రైతుల ధాన్య నిల్వకు నూతన భవనాలు ఎంతో ఉపయోగకరం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 04 (సింగిడి)

బాన్సువాడ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని రైతునగర్ గ్రామంలో విబిజి రామ్ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామైక్య సంఘం భవనాన్ని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ధాన్య నిల్వ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గ్రామైక్య సంఘం భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళలు సంఘటితంగా పనిచేస్తూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బాన్సువాడ నియోజకవర్గం వరి ధాన్యం ఉత్పత్తిలో ముందంజలో ఉందని, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ తదితర మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోనే ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు నిర్మించిన కేంద్రం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవడంతో పాటు, రైతులు మిల్లులు, దళారులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు.బాన్సువాడ శాసనసభ్యులు, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో రైతునగర్ గ్రామం ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కళ్యాణ మండపానికి అనుబంధ భవన నిర్మాణానికి సహకారం అందించిన దాత నాగేశ్వరరావు సేవలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ అభివృద్ధికి దాతలు అందించే సహకారం ప్రశంసనీయమని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అగ్రోస్ చైర్మన్, ఆర్డీఓ, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పీనట్ బట్టర్ ఆరోగ్య లాభాలు..

క్రీమీ పీనట్ బట్టర్ తయారు చేయడం ఎలా?



పీనట్ బట్టర్ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమైనది. ఇందులో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని అందించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు నియంత్రణలో సహాయపడుతుంది. అయితే మార్కెట్లో లభించే పీనట్ బట్టర్‌లో కృత్రిమ తీపి పదార్థాలు, ప్రిజర్వేటివ్స్ ఉండవచ్చు. అందుకే ఇంట్లోనే సులభంగా క్రీమీ పీనట్ బట్టర్ తయారు చేసుకోవడం చాలా ఉత్తమం. ప్రతిరోజూ దీన్ని మితంగా తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య లాభాలు పొందవచ్చు.

పీనట్ బట్టర్ వల్ల కలిగే ఆరోగ్య లాభాలు:
ప్రొటీన్ల గని: వేరుశెనగలో ప్లాంట్-బేస్డ్ ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కండరాల నిర్మాణానికి, శరీర శక్తికి ఎంతగానో తోడ్పడతాయి.

బరువు నియంత్రణ: పీనట్ బట్టర్ తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది పదే పదే ఆహారం తినాలనే కోరికను తగ్గించి, బరువు అదుపులో ఉండేలా సహాయపడుతుంది.
గుండె ఆరోగ్యం: ఇందులో ఉండే మోనోఅన్సాచురేటెడ్ ఫ్యాట్స్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

శక్తినిస్తుంది: రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పీనట్ బట్టర్ తీసుకోవడం ద్వారా శరీరానికి రోజంతా సరిపడా శక్తి లభిస్తుంది.

ఇంట్లోనే క్రీమీ హోంమేడ్ పీనట్ బట్టర్ తయారీ విధానం:
మార్కెట్లో లభించే పీనట్ బట్టర్‌లో పంచదార, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. అందుకే ఇంట్లోనే స్వచ్ఛమైన పీనట్ బట్టర్ తయారు చేసుకోవడం చాలా సులభం.

కావలసిన పదార్థాలు: రెండు కప్పుల పచ్చి వేరుశెనగలు, రుచికి సరిపడా కొద్దిగా ఉప్పు లేదా తేనె (ఆప్షనల్), ఒక స్పూన్ వేరుశెనగ నూనె (అవసరమైతే).

తయారీ విధానం:
ముందుగా స్టవ్ మీద బాణలి పెట్టి వేరుశెనగలను దోరగా, సువాసన వచ్చే వరకు వేయించాలి. వేయించిన వేరుశెనగలు పూర్తిగా చల్లారిన తర్వాత వాటి పొట్టును సులభంగా తొలగించవచ్చు.
ఇప్పుడు ఆ పప్పులను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
మిక్సీ పడుతున్నప్పుడు వేరుశెనగలోని సహజ నూనెలు బయటకు వచ్చి పేస్ట్ రూపంలో మారుతుంది.
ఇది మరింత క్రీమీ టెక్చర్ రావడానికి కొద్దిగా ఆయిల్, చిటికెడు ఉప్పు లేదా తేనె కలుపుకోవచ్చు.
అంతే! ఎంతో రుచికరమైన, ఆరోగ్యకరమైన హోంమేడ్ క్రీమీ పీనట్ బట్టర్ సిద్ధం. దీన్ని గాజు సీసాలో నిల్వ చేసుకుని వాడుకోవచ్చు.



చలికాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీసే 7 అలవాట్లు..

వీటిని అస్సలు నిర్లక్ష్యం చేయకండి!



ఉదయం వేళల్లో చలి క్రమంగా పెరుగుతోంది. చల్లని గాలులు, ఉష్ణోగ్రతల్లో మార్పులతో చాలామందికి జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ఈ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అయితే చల్లని వాతావరణం వల్ల నేరుగా వైరల్ ఇన్ఫెక్షన్లు రావు. ఉష్ణోగ్రతల్లో మార్పులు, ఎక్కువసేపు గదుల్లోనే ఉండటం, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం వంటి కారణాలతో వైరస్‌లు వ్యాపించే అవకాశం పెరుగుతుంది. మన రోజువారీ అలవాట్లలో చేసే కొన్ని పొరపాట్లు కూడా అనారోగ్యానికి దారితీయవచ్చు.

చలికాలంలో అనారోగ్యానికి దారితీసే 7 పొరపాట్లు

న్యూస్9 డిజిటల్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన మెడ్‌ఫస్ట్ ఈఎన్‌టీ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ (మేజర్) రాజేష్ భరద్వాజ్ ప్రకారం.. వాతావరణ మార్పుల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించుకోవచ్చు.

వాతావరణానికి తగిన దుస్తులు ధరించకపోవడం: ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లేటప్పుడు తగినంత వెచ్చని దుస్తులు ధరించాలి. చలికి అనుగుణంగా దుస్తులను పొరలుగా వేసుకోవడం మంచిది.
నీరు తక్కువగా తాగడం: చలికాలంలో దాహం తక్కువగా అనిపించినా శరీరానికి తగినంత నీరు అవసరం. నీరు తక్కువగా తీసుకోవడం వల్ల గొంతు, ముక్కులోని శ్లేష్మ పొరలు పొడిబారవచ్చు. కాబట్టి రోజంతా తగినంత ద్రవాలు తీసుకోవాలి.

చేతుల పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయడం: బయటకు వెళ్లి వచ్చిన తర్వాత, ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో తిరిగినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. చేతులతో కళ్లు, ముక్కు, నోటిని తాకకుండా జాగ్రత్తపడాలి.
గదుల్లోకి గాలి రాకుండా చేయడం: చలి కారణంగా కిటికీలు ఎప్పుడూ మూసి ఉంచడం మంచిది కాదు. సాధ్యమైనప్పుడు గదుల్లోకి స్వచ్ఛమైన గాలి వచ్చేలా చూసుకోవాలి.
అనారోగ్య లక్షణాలను తేలికగా తీసుకోవడం: తుమ్ములు, గొంతునొప్పి, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. అవి ఎక్కువవుతున్నా, ఎక్కువకాలం కొనసాగుతున్నా వైద్యులను సంప్రదించాలి.
నిద్ర, ఆహారంపై శ్రద్ధ చూపకపోవడం: తగినంత నిద్ర లేకపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం శరీర సాధారణ రోగనిరోధక పనితీరును ప్రభావితం చేయవచ్చు. పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలి.
సొంతంగా మందులు వాడటం: జలుబు, దగ్గు వచ్చిన ప్రతిసారీ వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకూడదు. సాధారణ జలుబు ఎక్కువగా వైరస్‌ల వల్ల వస్తుంది. యాంటీబయాటిక్స్ వైరస్‌లపై పనిచేయవు.
ఎవరికి ఎక్కువ జాగ్రత్త అవసరం?

ఆస్తమా, సీఓపీడీ (జ్యూణ), గుండె సంబంధిత సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గినవారు వాతావరణ మార్పుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వైద్యుల సూచన మేరకు అవసరమైన టీకాలు వేయించుకోవడం కూడా ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించడంలో సహాయపడుతుంది.

ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, తగ్గని అధిక జ్వరం లేదా లక్షణాలు తీవ్రమవడం వంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి. చలికాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే తగిన దుస్తులు ధరించడం, నీరు తాగడం, పరిశుభ్రత పాటించడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చిన్న అలవాట్లను నిర్లక్ష్యం చేయకూడదు.



98.6 °F లెక్క మారిందా?

స్టాన్‌ఫోర్డ్ స్టడీలో ఆసక్తికర విషయాలు!



మనిషి శరీర సాధారణ ఉష్ణోగ్రత 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ అని మనం చిన్నప్పటి నుంచి వింటున్నాం. జ్వరం ఉందా లేదా తెలుసుకోవడానికి కొలమానంగా భావిస్తాం.

అయితే స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. అందరికీ శరీర ఉష్ణోగ్రత ఒకేలా ఉండదని, సాధారణ ఉష్ణోగ్రతగా భావిస్తున్న 98.6 డిగ్రీలు అందరికీ వర్తించదని అంటున్నారు.

గతంతో పోలిస్తే శరీర ఉష్ణోగ్రత తగ్గుతోందా?

గతంతో పోలిస్తే ప్రజల సగటు శరీర ఉష్ణోగ్రత తగ్గుతోందని శరీరంలోని ఇందుకు జీవక్రియల వేగం (వీమ్ఝఎశీశ్రీఱఎ ఞ్ఛవ) తగ్గడం కారణమని అంటున్నారు. శరీరంలో వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ ఉన్నప్పుడు జీవక్రియల వేగం పెరిగి దీనివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందనీ గతంతో పోలిస్తే ప్రజల్లో ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు తగ్గడం కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి కారణమని డాక్టర్ పార్సొనెట్ వివరించారు.

మెరుగైన వైద్య సదుపాయాలు కూడా కారణమా?

గత 200 ఏళ్లలో వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయి. మెరుగైన వైద్య చికిత్సలు, పరిశుభ్రత, పోషకాహారం, జీవన ప్రమాణాల్లో మార్పులు ప్రజల ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపాయి. మనం నివసించే ఇళ్లలో ఉష్ణోగ్రత, సూక్ష్మజీవులతో మనకు ఉండే సంబంధం, ఆహారపు అలవాట్లు మారడం మరో కారణమని పరిశోధకులు తేల్చారు.

6 లక్షలకు పైగా శరీర ఉష్ణోగ్రతల పరిశీలన

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ పార్సొనెట్, ఆమె పరిశోధకుల బృందం స్టాన్‌ఫోర్డ్ హెల్త్ కేర్‌కు వచ్చిన రోగుల శరీర ఉష్ణోగ్రతలను విశ్లేషించారు. 6 లక్షల మంది రోగులకు సంబంధించిన నోటి ద్వారా థర్మామీటర్ తో కొలిచిన ఉష్ణోగ్రతల సమాచారాన్ని పరిశీలించారు. వారి వయసు, లింగం, బరువు, ఎత్తు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), వాడుతున్న మందులు, ఆరోగ్య సమస్యలను అధ్యయనం చేశారు. ఈ పరిశోధనలో సాధారణ శరీర ఉష్ణోగ్రతలు 36.2 నుంచి 36.8 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉన్నట్లు గుర్తించారు. అంటే మనం సాధారణంగా అనుకుంటున్న 36.6 డిగ్రీల ఉష్ణోగ్రత ఒక్కటే అందరికీ వర్తించే ప్రమాణం కాదు.

అందరికీ ఒకే ఉష్ణోగ్రత ఉండదు

వైద్యులతో పాటు ప్రజలు 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ నే (36.6 డిగ్రీల సెల్సియస్) ప్రతి ఒక్కరి సాధారణ శరీర ఉష్ణోగ్రతగా భావిస్తున్నారనీ, కానీ వ్యక్తి సాధారణ శరీర ఉష్ణోగ్రత అనేది వారి ఆరోగ్య పరిస్థితి, వయసు, సమయం పై ఆధారపడి మారుతుందన్నారు. ఈ పరిశోధనా ఫలితాలు జీూహీూ ×ఱ్వతీఱుశ్రీ వీవఎఱఎఱఅవ జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రస్తుతం ప్రజలందరికీ వర్తించేలా ఒక కొత్త సగటు ఉష్ణోగ్రతను నిర్ణయించడం సాధ్యం కాదని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఈ మార్పులన్నీ మనుషుల శరీర నిర్మాణం, శారీరక ప్రక్రియలపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. అందుకే గతంలో ఉన్న శరీర ఉష్ణోగ్రతలనే ఇప్పటికీ అందరికీ వర్తింపజేయడం సరైంది కాదని చెబుతున్నారు.

భవిష్యత్తులో పరిశోధనలు

శరీర ఉష్ణోగ్రత ఆధారంగా జ్వరాన్ని ఎలా గుర్తించాలి? సాధారణం కంటే ఎక్కువ లేదా తక్కువ ఉష్ణోగ్రత నిరంతరం ఉండటం ఆయుష్షుపై ప్రభావం చూపుతుందా? వీటిపై భవిష్యత్తులో అధ్యయనాలు జరగాలని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. మొత్తంగా చూస్తే, 36.6 డిగ్రీల సెల్సియస్ అనేది అందరికీ వర్తించే సాధారణ శరీర ఉష్ణోగ్రత కాదని ఈ అధ్యయనం సూచిస్తోంది. అయితే ఈ పరిశోధన ఆధారంగా జ్వరాన్ని గుర్తించే వైద్య ప్రమాణాలు మారినట్లు భావించకూడదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు ఉష్ణోగ్రతను అంచనా వేయాల్సి ఉంటుంది.

హర్మూజ్‌లో భారత నౌకలకు బిగ్ రిలీఫ్..

ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం



ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి లో నౌకల రాకపోకలపై విధించిన ఆంక్షల నుంచి భారత్ సహా నాలుగు దేశాలకు ఇరాన్ సడలింపు ఇచ్చింది. భారత్ నుంచి ఔషధాల (వీవఎఱఎఱఅవం) దిగుమతిని సులభతరం చేసేందుకు భారత నౌకలకు ఈ మినహాయింపు ఇస్తున్నట్లుగా ఇరాన్ పార్లమెంట్ కమిటీ వైస్ ఛైర్మన్ అహ్మద్ హయత్-మొగద్దమ్ వెల్లడించారు.

ఆ నాలుగు దేశాలకు మినహాయింపు..
హర్మూజ్ జలసంధిలో ఎదురవుతున్న భద్రతా ముప్పుల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, చైనా, ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన నౌకలకు ఈ జలసంధి గుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, తమ దేశానికి అత్యవసరమైన ఔషధాలను భారత్ నుంచి దిగుమతి చేసుకోవడం సులభతరం చేసేందుకే భారత నౌకలకు అనుమతి ఇచ్చినట్లుగా ఇరాన్ స్పష్టం చేసింది. అదే సమయంలో చైనా రాజకీయ మద్దతు పొందడం కోసం చైనా నౌకలకు అనుమతి ఇచ్చింది. దీంతో హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే భారత, చైనా నౌకల నుంచి ఇరాన్ రవాణా ఫీజు (ఫతీఖఅంఱ్ ఖీవవ) వసూలు చేయనుంది. మరోవైపు ఇటీవల జలసంధి సమీపంలో చోటుచేసుకున్న దాడుల్లో గుజరాత్‌కు చెందిన భారత నావికుడు గాంధార్ నహీమ్ అజీజ్ మృతి చెందడంతో పాటు అనేక మంది నావికులు ప్రమాదంలో పడ్డారు. వాణిజ్య నౌకలపై దాడులను అరికట్టాలని, రవాణా స్వేచ్ఛను పునరుద్ధరించాలని భారత్, ఇరాన్‌కు విజ్ఞప్తి చేసింది.

స్టాక్ మార్కెట్

Stock Market

పెట్రోల్-డీజిల్-సీఎన్జీ ధరలు..



ఈ నెల పెట్రోల్, డీజిల్ ధరల్లో ప్రాంతాన్ని బట్టి స్వల్ప మార్పులు జరుగుతుంటాయి. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వాణిజ్య, పారిశ్రామిక ఉత్పత్తిపై గతంలో విధించిన ఇంధన విక్రయాల ఆంక్షలను మాత్రం కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పెట్రోల్ బంకుల్లో ఒకే వాహనానికి రోజుకు 200 లీటర్ల డీజిల్ మాత్రమే విక్రయించాలనే పరిమితిని కేంద్రం జులై 1 నుంచి రద్దు చేసింది. 1 వ తారీకు వస్తే ధరలు తగ్గుతాయనే ఎదురుచూసిన ప్రజల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. ఇక సీఎన్‌జీ (జచీ+) ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేదు. చివరిసారిగా మే చివరి వారంలో పెరిగిన ధరలే ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మరీ తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్,సీఎన్టీ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదరాబాదు
లీటర్ పెట్రోల్ ధర: రూ. 116.15
లీటర్ డీజిల్ ధర రూ. 104.23
సీఎన్జీ కిలో ధర రూ. 112.00

వరంగల్
లీటర్ పెట్రోల్ ధర: రూ. 115.62
లీటర్ డీజిల్ ధర రూ. 103.74
సీఎన్జీ కిలో ధర రూ: 112.00
విశాఖపట్నం..
లీటర్ పెట్రోల్ ధర: రూ. 116.39
లీటర్ డీజిల్ ధర రూ. 104.11
సీఎన్జీ ధరలు రూ. 99.80
విజయవాడ:
లీటర్ పెట్రోల్ ధర: రూ. 117.25
లీటర్ డీజిల్ ధర రూ. 104.96
సీఎన్జీ ధరలు రూ. 103.00

అనిల్ అంబానీ గ్రూప్‌కు ఈడీ బిగ్ షాక్



అనిల్ అంబానీ గ్రూప్‌నకు ఈడీ మరో భారీ షాకిచ్చింది. రూ. వేల కోట్ల బ్యాంకింగ్ మోసం, మనీ లాండరింగ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం తీవ్రమైన చర్యలు చేపట్టింది. గ్రూప్‌నకు చెందిన రెండు ప్రైవేట్ విమానాలు, భూములు, ఫిక్స్డ్ డిపాజిట్లతో సహా ఏకంగా రూ. 510 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ప్రజాధనాన్ని విదేశాలకు మళ్లించారనే ఆరోపణల నేపథ్యంలో.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద మహారాష్ట్రలోని 'డాసాల్ట్ ఫాల్కన్ 2000', 'ఎంబ్రాయర్' అనే రెండు ప్రైవేట్ జెట్ విమానాలు, 6 ప్లాట్లు, కార్యాలయ ప్రాంగణంతో పాటు తమిళనాడులోని రెండు విండ్ మిళ్లు, బ్యాంక్ ఫండ్లను జప్తు చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన ప్రజాధనాన్ని ప్రమోటర్లు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, విదేశాలకు మళ్లించడానికి దివాలా చట్టాన్ని (ఐబీసీ) దుర్వినియోగం చేశారని విచారణలో తేలింది. ఈ కేసుల్లో ఇప్పటికే 10 మందిని అరెస్టు చేసి, ఫెమా కింద 6 ఛార్జిషీట్లు దాఖలు చేసిన అధికారులు.. తాజా జప్తుతో ఈ వ్యవహారంలో రికవరీ అయిన మొత్తం ఆస్తుల విలువను ఏకంగా రూ. 23,100 కోట్లకు చేర్చారు.

యాక్సిస్ బ్యాంక్ కస్టమర్లకు షాక్



చిన సేవల ఛార్జీలపై కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 1 నుండి అమల్లోకి వచ్చే ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం, ఈజీ యాక్సెస్, కృషి, సహజ్ వంటి ఖాతాదారులకు ఉచిత నగదు లావాదేవీల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 4 నుంచి 3కి తగ్గించింది. దీనికి తోడు, సగటు నెలవారీ మినిమమ్ బ్యాలెన్స్ నిర్వహించని సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంత ఖాతాదారులపై విధించే గరిష్ట జరిమానాను రూ. 150-300 నుండి ఏకంగా రూ. 600కి పెంచింది. అయితే ఈ మినిమమ్ బ్యాలెన్స్ చార్జీల నుంచి శాలరీ ఖాతాదారులకు మినహాయింపు ఉంటుంది. కస్టమర్లకు షాక్ ఇస్తూ, బర్గుండి, ప్రయారిటీ, ప్రెస్టీజ్, ఎన్ఆర్ఐ ఖాతాదారులకు డెబిట్ కార్డులు, బ్యాంకింగ్ సేవలపై ఇచ్చే 'ఎడ్జ్ రివార్డ్ పాయింట్లను' డిసెంబర్ 1 నుండి పూర్తిగా నిలిపివేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. అంతేకాకుండా, బయటకు పంపే చెక్ రిటర్న్ ఛార్జీని ప్రతి రిటర్న్‌కు స్థిరంగా రూ. 200గా సవరించగా, ఎన్ఆర్ఐ ప్రైమ్, బర్గుండి ఖాతాదారులకు డెలివరబుల్ రిటర్న్ ఫీజును రూ. 50 నుండి ఏకంగా రూ. 500కి (10 రెట్లు) పెంచింది. కస్టమర్లు అదనపు భారాల నుంచి తప్పుకోవాలంటే డిసెంబర్ 1 నాటికి ఖాతా నిల్వలను, చెక్ లావాదేవీలను సరిచూసుకోవాలని బ్యాంక్ సూచించింది.

మల్లేపల్లి చెరువుకు కాలుష్య కాటు..

మృత్యువాత పడుతున్న చేపలు!
కంపెనీల కెమికల్ వ్యర్థాలతో చెరువు నీరు కలుషితం?
100 కిలోల చేపలు మృతి.. రూ.1.50 లక్షల నష్టం
మిగిలిన చేపల పరిరక్షణకు అధికారుల చర్యలు ఏవీ?



సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): కొండాపూర్ మండలం మల్లేపల్లి చెరువులో చేపలు పెద్ద సంఖ్యలో మృతి చెందడం స్థానిక మత్స్యకారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సమీపంలోని కంపెనీల నుంచి వెలువడుతున్న కెమికల్ వ్యర్థ జలాలు చెరువులోకి చేరడం వల్లే చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో పాటు పరిశ్రమల నుంచి వచ్చిన రసాయనాలతో కూడిన నీరు చెరువులో కలిసినట్లు వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం చెరువులో సుమారు లక్ష చేప పిల్లలను వదిలిన మత్స్యకారులు వాటి పెంపకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ఒక్కసారిగా చేపలు మృతి చెందడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పటివరకు సుమారు 100 కిలోల చేపలు మృతి చెందగా, దాదాపు రూ. 1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు తెలిపారు. చెరువులో ఇంకా పెద్ద సంఖ్యలో చేపలు ఉండటంతో వాటిని కాపాడుకోవడం ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. అధికారులు వెంటనే స్పందించి చెరువు నీటి నాణ్యతను పరీక్షించాలని, కాలుష్యానికి కారణాలను గుర్తించాలని కోరుతున్నారు. పరిశ్రమల వ్యర్థ జలాలు చెరువులోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని, నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుడు ఆకుల వెంకటేశం మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం చెరువులో లక్ష చేప పిల్లలను వదిలామని, రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో పాటు కంపెనీల నుంచి కెమికల్ నీరు చెరువులోకి చేరడంతో సుమారు 100 కిలోల చేపలు మృతి చెందాయని తెలిపారు. దీంతో దాదాపు రూ. 1.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మస్కట్‌లో ఇరుక్కున్న మహిళా.. కేటీఆర్ సాయంతో కొడంగల్‌కు..



కొడంగల్, నవంబర్ 4 (సింగిడి): బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లి,వేధింపుల కు గురైన కొడంగల్ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ కెటిఆర్ సహాయంతో కొడంగల్ కు చేరుకుంది.కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గత ఫిబ్రవరిలో మస్కట్ వెళ్లిన మహిళ అక్కడే పని ఒత్తిడి లో వేధింపుల కు గురి కావడంతో, ఆమె కుమారుడు కొడంగల్ లోని కాంగ్రెస్ నాయకులను పలుమార్లు కలిసి విన్నవించుకున్న పట్టించుకోలేదని, దీంతో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డిని కలువగా కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే మహిళ ను హైదరాబాద్ కి రప్పించినట్లు తెలిపారు. దీంతో మహిళా కుటుంబ సభ్యులు పట్నంనరేందర్ రెడ్డికి, కెటిఆర్ లకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో నరేందర్ రెడ్డి ప్రజల్లో ఉండే వ్యక్తి గా ,ప్రజాసమస్యలపై స్పందించే వ్యక్తి గా మరోసారి నిరూపించుకున్నారు. ముఖ్యమంత్రి ఇలాకాలో కెటిఆర్ సహాయం కోరడం, కెటిఆర్ ప్రయత్నం ఫలించడంతో కొడంగల్ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మల్కాజిగిరి, నవంబర్ 4 (సింగిడి): వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వెస్ట్ కాకతీయ నగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్య లక్ష్మి లు పాల్గొని భూమి పూజ నిర్వహించి, శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వెస్ట్ కాకతీయ నగర్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పటిష్టంగా రోడ్డును నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సత్యలక్ష్మి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, బద్ధం పరశురాం రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, స్థానిక కాలనీ వాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకురావాలి

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ గౌడ్



కొడంగల్, నవంబర్ 4 (సింగిడి): విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు రావాలని,విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, విద్యారంగ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందన్నారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు గళమెత్తాలని, విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యతను అలవర్చుకొని సమాజ మార్పులో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షుడు నిజాం, సభ్యులు నోహన్, శ్రీకాంత్, గోవర్ధన్, భాను, మోహన్, అల్లా బాకస్, కార్తీక్, బాలరాజ్, ఎండి. అర్మాన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించండి.. సాగు ఖర్చులు తగ్గించుకోండి

ఎటీఎంఎ ఆధ్వర్యంలో వరి పొలం బడి క్షేత్ర దినోత్సవ కార్యక్రమం



కొమురవెల్లి నవంబర్ 4 (సింగిడి): వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు, సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఎటీఎంఎ' పథకం ద్వారా కొమురవెల్లిలో వరి పొలం బడి క్షేత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంటను పరిశీలిస్తూ రైతులకు సమగ్ర పోషక యాజమాన్యం మరియు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భవ్య సిద్ధిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి చేర్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు ఇన్ఛార్జి పద్మ ఎటీఎంఎ – బిటిటి చేర్యాల చైర్మన్ జక్కుల తిరుపతి, కొమురవెల్లి సర్పంచ్ గొల్లపల్లి పద్మ అంజనేయులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ నమోదు



కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (సింగిడి): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉషోదయ టవర్స్ నందు తెలంగాణ రక్షణ సేన మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం వీరేంద్ర కుమార్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బాధ్యులు ఎత్తరి మారయ్య అధ్యక్షతన త్వరలో జరగబోయే హైదరాబాద్ –రంగారెడ్డి–మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల లో భాగంగా పట్టబద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ చామర్తి సీతారాం, బెంజిమెన్ పాల్, ఎల్ పి రాజు, మనీష్ గుప్తా, మొండి సాయి కృష్ణ, సన్నీ గౌడ్, షియాజ్ హుస్సేన్, సాయి, మురళి, షేక్ అమీర్, ఎండీ సిరాజ్, మోస్సిన్ తెరాస నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (సింగిడి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులతో హఫీజ్ పేట్, హైదర్ నగర్ డివిజన్ల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.



ఎస్‌కేఎస్ ఫోర్క్‌లిఫ్ట్ సర్వీసెస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కాప్రా, నవంబర్ 4 (సింగిడి): పారిశ్రామిక రంగ అభివృద్ధికి, వ్యాపార విస్తరణకు నూతన సంస్థలు దోహదపడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిఅన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ఎస్‌కేఎస్ ఫోర్క్‌లిఫ్ట్ సర్వీసెస్ నూతన కార్యాలయం ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిర్వహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో వస్తున్న నూతన అవకాశాలను యువ పారిశ్రామికవేత్తలు అందిపుచ్చుకోవాలని, నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు చేస్తూ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని, పారిశ్రామికవాడల్లో వ్యాపార సంస్థల అభివృద్ధి స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలాన్ని చేకూరుస్తుందని, ఎస్‌కేఎస్ ఫోర్క్‌లిఫ్ట్ సర్వీసెస్ సంస్థ క్లూగాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అధీకృత డీలర్‌గా మెటీరియల్ హ్యాండ్లింగ్ రంగంలో సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. సంస్థ యాజమాన్యం నాణ్యమైన సేవలతో వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వినియోగదారులు, వ్యాపార భాగస్వాములు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరవ

- తాగునీటి బోర్ల మంజూరుకు, 22-ఎ జాబితా నుంచి కాలనీల తొలగింపునకు కలెక్టర్ సానుకూల హామీ



కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ రిడ్జ్ టవర్స్ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను వెంటబెట్టుకొని జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి సమస్యను వివరించారు. కాలనీలో నూతన బోర్లు మంజూరు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నూతన బోర్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రంగారెడ్డి నగర్ డివిజన్ విజయనగర్, మారుతి నగర్ కాలనీలకు చెందిన సుమారు 400 కుటుంబాలు ఎదుర్కొంటున్న 22-ఎ నిషేధిత జాబితా సమస్యను సహితం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ జాబితాలో చేర్చడం వల్ల ఇళ్ల రిజిస్ట్రేషన్లు, ప్లాట్ల క్రయవిక్రయాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించి, సంబంధిత భూములను 22-ఎ జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యపై కలెక్టర్ స్పందిస్తూ, పూర్తి వివరాలను పరిశీలించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కూన శ్రీశైలం గౌడ్ కార్యాలయ వర్గాలు పంపిన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ సమస్యల నుంచి విముక్తి కల్పించే వరకు తన వంతు కృషి కొనసాగిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మిదేవేందర్, బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, కూన రాఘవేంద్ర గౌడ్, రిడ్జ్ టవర్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జనార్దన్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సురేష్, పవన్, చక్రి, రమేష్ బాబు, రంగా రెడ్డి నగర్ డివిజన్ కి చెందిన షకీర్, ప్రభాకర్ రెడ్డి,మల్లం శీను, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు రెండు నిండు ప్రాణాలు

వికారాబాద్ జిల్లాలో విషాదం
సుద్ద గుంతలో పడి ఇద్దరు మృతి



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): నిర్లక్ష్యం ఖరీదు రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. మైనింగ్ నిర్వహించిన వారు పరిస్థితులను, ప్రమాదాన్ని సూచించే హెచ్చరికలను ఏర్పాటు చేసి ఉంటే ప్రాణాలు పోయేవి కావని గ్రామస్తులు భావించారు. గుంతల్లో నిండిన లోతు తెలియక అమాయకులు మృత్యు వాతపడిన ఘటన వికారాబాద్ జిల్లా దారూర్ మండలం తరిగోపులలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం. తరిగోపుల గ్రామానికి చెందిన అశోక్, శ్రీనివాస్ గా గుర్తించారు. వీరిద్దరూ మేకలు మేపేందుకు తరిగోపుల జైదుపల్లి మధ్య ఉన్న ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గొర్రెలను కడిగేందుకు సుద్ద గుంతలోకి దిగిన అశోక్ ప్రమాదవశాత్తు లోతైన నీటిలో పడిపోయాడు. అతడు మునిగిపోవడం చూసిన శ్రీనివాస్ వెంటనే కాపాడేందుకు నీటిలోకి దూకాడు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇలా అకాల మరణం చెందడంతో తరిగోపుల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే మైనింగ్ నిర్వహణ కూడా ఇస్టా రాజ్యాంగ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో తగిన నిబంధనలను పాటించాలని లేనిపక్షంలో మనుషులు ప్రాణాలకు, మూగజీవుల ప్రాణాలకు హాని పొంచి ఉన్నదని పలువురు భావిస్తున్నారు. అయితే మైనింగ్ నిర్వహణలో కూడా లోపాలు ఉన్నాయని సంబంధిత అధికారులు తగిన విచారణ జరిపించాలని మైనింగ్ నిబంధనలను అమలు చేయాలని పలువురు కోరారు. ఇద్దరి మృతికి భాధ్యత కూడా నిర్వాహకులు వహించాలని అన్నారు.

పెండింగ్ పనుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి



మల్కాజిగిరి, నవంబర్ 4 (సింగిడి): మల్కాజిగిరి నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ మంగళవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, చెరువుల అభివృద్ధి, క్రీడా ప్రాంగణాల నిర్మాణం, పార్కుల అభివృద్ధి తదితర అంశాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రతిపాదిత పనులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఈ. లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి, ఇబ్రహీం , మోహన్ రెడ్డి, మల్లేశ్ చారి, బాలకృష్ణ, విజయ్ రెడ్డి, విజయ్ శేఖర్, యాదగిరి గౌడ్, స్థానిక కాలనీ వాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై గ్రామగ్రామాన పాదయాత్ర

- కార్యకర్తకు ఆపద వస్తే ఒక్క మిస్‌కాల్ చేయండి.. మీ ముందుంటా
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 4 (సింగిడి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, అక్రమ అరెస్టులు, వేధింపులు, అవమానాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యకర్తల సమస్యలను సావధానంగా విన్న చింతా ప్రభాకర్ వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు త్వరలోనే గ్రామగ్రామాన పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలోని నాయకులే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ అంతర్గత కుమ్ములాటలతో కాలం గడుపుతున్నారని, అలాంటి నాయకులు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు అందించలేని అసమర్థ ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిపోయిందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించారని గుర్తుచేశారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు భరోసా ఇస్తూ.. పార్టీ కార్యకర్తకు ఏ చిన్న ఆపద వచ్చినా, సమస్య ఎదురైనా ఒక్క మిస్ కాల్ చేయండి.. మీ ముందుకు వచ్చి అండగా నిలబడతానని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలకు తావివ్వకుండా ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఇట్టి కార్యక్రమములొ సి డి సి మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గడిల సుధీర్ రెడ్డి కోడూరి రమేష్ కుందనరాజు పట్టణ పార్టీ అధ్యక్షులు చిల మల్లన్న సీనియర్ నాయకులు చింత సాయినాథ్ ఆత్మకూరు నగేష్ స్థానిక సర్పంచ్ తొంట కిష్టయ్య స్థానిక మాజీ సర్పంచ్లు లక్ష్మారెడ్డి గడ్డమీద సత్యనారాయణ మాజీ ఎంపీటీసీలు సత్యనారాయణ యాదవ్ అమరేందర్ రెడ్డి సుధాకర్ మాధవరెడ్డి శివకుమార్ అల్లం లలిత అహ్మద్ అశోక్ పండరి సర్పంచులు రవికుమార్ కృష్ణారెడ్డి సంతోష్ గౌడ్ ప్రమోద్ నవీన్కుమార్ నాగరాజు గుడ్ల లక్ష్మణ్ యువత అధ్యక్షులు నరేష్ గౌడ్ నగేష్ యాదవ్ బిఆర్ఎస్వి ఇన్చార్జ్ శ్రీహరి నిజాముద్దీన్ సలావుద్దిన్ పాండు నాయక్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాజీ సర్పంచ్లు మాణిక్ రాములు దశరథ్ నగేష్ సిద్దన్న సంగమేష్ కరుణాకర్ సంఘన్న శేఖర్ రాములు నాయకులు యాద గౌడ్ శంభు ప్రసాద్ నబీమియా జైపాల్ శ్రీనివాస్ రెడ్డి రఫీ షబ్బీర్ రమేష్ పాషా రవి శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

జనరల్ NEWS

సింగిడి

పాలమూరు రైతుల కష్టాలకు గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యమే కారణం

- హరీష్ రావు అవాస్తవాలు మాట్లాడుతున్నారు.. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలా?
- 15 టీఎంసీల గూడెం దొడ్డి రిజర్వాయర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు?
- పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందనడం విడ్డూరం
- డీసీసీ కార్యాలయంలో మంత్రి
- జూపల్లి కృష్ణారావు ఘాటు వ్యాఖ్యలు



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): పాలమూరు రైతుల కష్టాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ప్రాజెక్టులను అధికారంలో ఉన్నప్పుడే పూర్తి చేయకుండా ఇప్పుడు ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలకు వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు వనపర్తి పర్యటనలో ఇష్టానుసారంగా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యల్లో వాస్తవాల కంటే రాజకీయ ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్ రావును ఉద్దేశించి మంత్రి పలు ప్రశ్నలు సంధించారు. కృష్ణా జలాలకు సంబంధించి జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలేనన్న విషయం మీకు తెలియదా?

-గూడెం దొడ్డి రిజర్వాయర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు?

15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాల్సిన గూడెం దొడ్డి రిజర్వాయర్‌ను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని జూపల్లి ప్రశ్నించారు. ఆ రిజర్వాయర్ పూర్తయి ఉంటే వేలాది ఎకరాలు సాగులోకి వచ్చేవని, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. 2012 నుంచి కల్వకుర్తి ప్రాజెక్టులో ఐదు మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ గతంలోనే వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నీరు ఎందుకు అందించలేదని నిలదీశారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో మోటార్లు మునిగి కాలిపోయిన విషయం హరీష్ రావుకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం వాటిని ప్రారంభిస్తే మిషన్ భగీరథకు తాగునీరు అందించడంలో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని వివరించారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని నార్లాపూర్ నుంచి లక్షల ఎకరాల సాగు అవసరాల కోసం నీటిని విడుదల చేశామని తెలిపారు.

-90 శాతం పనులు పూర్తయితే రూ.80 వేల కోట్లు ఎందుకు?

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందంటూ హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను మంత్రి తప్పుబట్టారు. సుమారు రూ.60 వేల కోట్ల వ్యయంతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేయాలంటే సుమారు రూ.80 వేల కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మరో మూడు నెలల వరకు ఏదుల రిజర్వాయర్‌కు నీటిని అందించలేమని స్పష్టం చేశారు. కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

-ఆంధ్రాకు నీటిని తరలించింది మీ ప్రభుత్వమే కాదా?

ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ నాయకులు నీటిని తరలిస్తున్నారంటూ హరీష్ రావు చేసిన ఆరోపణలను జూపల్లి ఖండించారు. బీఆర్ఎస్ పాలకులే గతంలో ఆంధ్రాకు నీటిని తరలించారని ఆరోపించారు. 2014--15లో 375 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని, ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్, హరీష్ రావులు కలిసి 511 టీఎంసీల నీటిని ఆంధ్రాకు అప్పగించారని విమర్శించారు. గత పాలకుల నిర్లక్ష్యం, ప్రణాళికా లోపాల వల్లే నేడు పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

-కరువు మండలాలపై ప్రభుత్వ ప్రణాళికలు

ప్రకృతి వైపరీత్యాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బీఆర్ఎస్ నేతలకే చెల్లిందని మంత్రి విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కరువు ప్రభావిత మండలాలను గుర్తించే ప్రక్రియ చేపట్టి రైతులకు అవసరమైన సహాయక చర్యల కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రైతుల పంటలు ఎండిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకే పరిమితం కాకుండా సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై పాలకులు, ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం రైతాంగంలో వ్యక్తమవుతోందని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఈ నెల 13లోగా అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలి
- రబీ సాగుకు దూరంగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలి
- తాగునీటి అవసరాలకే అందుబాటులో ఉన్న నీటిని వినియోగించాలి
- ఉపాధి కల్పనకు వీబీ-జీ రామ్-జీ పనులను విస్తృతంగా చేపట్టాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన ఇంచార్జ్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





వనపర్తి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో తీవ్ర నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 13వ తేదీలోపు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నీటి సంరక్షణ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు, జిల్లా వ్యవసాయ శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల సాగుకు దూరంగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

-రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

రబీ పంటల సాగుకు దూరంగా ఉండాలని రైతులకు సూచిస్తున్న నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు వీబీ-జీ రామ్-జీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న పనుల జాబితాతో పాటు అదనంగా మరిన్ని పనులను గుర్తించి షెల్ఫ్ ఆఫ్ వర్క్ సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని నీటిపారుదల కాలువల శుభ్రత, నిర్వహణ పనులు, జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు, భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ గుంతలు, ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణ రహదారులపై పెండింగ్ పనులు, మురుగుకాలువల నిర్మాణం, పశువులకు అవసరమైన పచ్చిక పెంపకం వంటి పనులను చేపట్టాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. జాబ్ కార్డుల నిర్వహణ, ప్రక్షాళనకు ఇది సరైన సమయమని కలెక్టర్ పేర్కొన్నారు. మరణించిన వారు, అందుబాటులో లేని వ్యక్తుల వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం అనర్హుల పేర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీబీ-జీ రామ్-జీ పథకం కింద పాఠశాలల్లో అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. వీబీ-జీ రామ్-జీ పనుల్లో కూలీల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

-తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన చోట బోర్‌వెల్స్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

-పది రోజుల్లో మరోసారి సమీక్ష

ప్రస్తుతం నిర్దేశించిన పనుల పురోగతిపై రానున్న పది రోజుల్లో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తదుపరి సమావేశానికి ప్రతి మండల అధికారి తాము చేపట్టిన చర్యలు, పనుల పురోగతికి సంబంధించిన కార్యాచరణ నివేదికతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో ఇచ్చిన సూచనలను పక్కాగా అమలు చేస్తూ నిర్దేశించిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాంరెడ్డి, జడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత బాగుంది

జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): నల్గొండ జిల్లాలో రక్షిత మంచినీరు , పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ తీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు . అనంతరం జ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో తాగునీరు ,పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని, అలాగే పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న వైద్యం, ఆరోగ్యం పారిశుధ్య కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని, అధికారులను ఆయన అభినందించారు .మారు మూల గిరిజన ప్రాంతాలతో పాటు, అన్ని గ్రామాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా కొనసాగించాలని, అలాగే ఎల్ నినో పరిస్థితి దృష్ట్యా నీటిని వృధా చేయకుండా వినియోగపడేలా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తరచూ తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, అప్పుడే విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించిన వారం అవుతారని అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో ఆర్ఓ ప్లాంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ (ప్రేమ్ కరణ్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ ఈ నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, వైద్య, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్ హెచ్ ఆర్ సి స్పెషల్ మానిటర్ కు వివరించారు.

విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన దృక్పథంతో అవార్డులు

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర మోహన్ రెడ్డి



రాజేంద్రనగర్ , నవంబర్ 4 (సింగిడి): నార్సింగి సర్కిల్ పరిధిలోని మంగళవారం మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలోని ఏసీఎం విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం పరిశోధన దృక్పథంతో చాప్టర్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏసీఎం ఇండియా రీజియన్-3 బెస్ట్ మెంబర్‌షిప్ గ్రోత్ ఇనిషియేటివ్ అవార్డు లభించిందని ఎం జి ఐ టి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి చంద్రమోహన్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఐటీలో సుమారు 45 మంది విద్యార్థులు ఏసీఎం సభ్యత్వం పొందడం ఈ అవార్డు సాధనకు ప్రధాన కారణమైంది. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణుల సంఘంతో అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో కళాశాల యాజమాన్యం సభ్యత్వ రుసుమును చెల్లించడం విశేషం అన్నారు.ఏసీఎం సభ్యత్వాల పెంపునకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను ప్రశంసించారు.సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.వి. రాజీకాంత్ ఏసీఎం చాప్టర్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, విద్యార్థి సభ్యులకు అభినందిస్తూ, ఈ గుర్తింపును స్ఫూర్తిగా తీసుకుని ఏసీఎం వేదికగా మరిన్ని సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఏసీఎం హైదరాబాద్ చాప్టర్ సభ్యుల సహకారంతో వర్క్‌షాప్‌లు, ప్రముఖ సాంకేతిక నిపుణులతో గెస్ట్ లెక్చర్లు, సాంకేతిక ప్రదర్శనలు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించేందుకు విద్యార్థులు చొరవ చూపాలని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు ఎంజీఐటీలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా దృక్పథం, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధికి కళాశాల అందిస్తున్న ప్రోత్సాహానికి గుర్తింపుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో పురోగతి కనిపించాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న



వరంగల్, నవంబర్ 4 (సింగిడి): నగరంలో పన్ను వసూళ్లలో ఆశించిన పురోగతి కనిపించాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రెండు సర్కిళ్ల పరిధిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్ను వసూళ్ల తీరును సమీక్షించారు. ఆస్తి పన్ను వసూళ్లతోపాటు నీటి పన్ను వసూళ్లను కూడా సమాంతరంగా చేపట్టాలని, వసూళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్ధభాగం ముగిసిన నేపథ్యంలో మిగిలిన కాలంలో పన్ను వసూళ్ల లక్ష్యాల సాధనకు ప్రతి రెవెన్యూ అధికారి,ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్ను బకాయిల వసూళ్లపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, తదుపరి నిర్వహించే సమీక్షా సమావేశం నాటికి వసూళ్లలో స్పష్టమైన పురోగతి కనిపించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, బిర్రు శ్రీనివాస్, పన్నుల అధికారి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు షహజాది బేగం, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రంగానికి వెన్నుదన్నుగా బిఆర్టీయు..

- జెకె ఫెన్నార్ పరిశ్రమకు చెందిన హెచ్ఎంఎస్, ఐఎన్టీయూసీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు బిఆర్టియులో చేరిక..
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జిఎంఆర్..



రామచంద్రాపురం, నవంబర్ 4 (సింగిడి): కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బిఆర్టియుకు రోజురోజుకూ కార్మికుల నుంచి ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. జెకె ఫెన్నార్ పరిశ్రమకు చెందిన హెచ్ఎంఎస్, ఐఎన్టియుసి కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్టియు లో చేరారు. కార్మికులందరికీ కార్మిక సంఘం కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం బిఆర్టియు నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల సాధనకు బిఆర్టియు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు రావాలని సూచించారు. త్వరలో జరగనున్న పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఆర్టియును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల మద్దతుతో బిఆర్టియు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, కార్మికులు శ్రీనివాస్, ఆదినారాయణ, మహేందర్ రెడ్డి, సూర్యచంద్ర రావు, మల్లేష్, వెంకటేష్, అర్జున్ రావు, సంగమేశ్, శివ కుమార్ రెడ్డి, రమణ, రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో కోదాడ పెద్ద చెరువు!

- కోట్ల విలువైన శిఖం భూములపై ఆక్రమణల పర్వం
- ఇప్పటికే వందల ఎకరాలు కబ్జాకు గురైనట్లు ఆరోపణలు
- ఖానాపురం గ్రామ శివారులోనూ మళ్లీ ఆక్రమణలు
- నోటీసులు జారీ చేసినా ఆగని భవన నిర్మాణం
- చెరువు చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని ప్రజల డిమాండ్





కోదాడ, నవంబర్ 4 (సింగిడి): సాగు, తాగునీటిని అందిస్తూ వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్న కోదాడ పెద్ద చెరువు క్రమంగా కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంటోంది. నిజాం కాలం నుంచి పట్టణానికి కల్పతరువుగా ఉన్న ఈ చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోంది. పట్టణ పరిధిలో భూముల ధరలు పెరగడంతో చెరువు శిఖం భూములపై ఆక్రమణదారుల కన్ను పడింది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు క్రమంగా అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువు ఆక్రమణలపై సామాజిక కార్యకర్తలు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతోపాటు, మీడియా కూడా అనేక కథనాలు ప్రచురించినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.

హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ ఆక్రమణలు!

పెద్ద చెరువు శిఖం భూముల్లో మట్టి పోసి చదును చేస్తూ ఆక్రమణలకు యత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిపై గోపయ్య చారి విగ్రహం సమీపంలో చెరువు భూమిలో మట్టి పోసి చదును చేశారు. గతంలో ఇదే స్థలంలో మట్టి కుప్పలు వేసి డబ్బా కొట్టు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా సామాజిక కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు అక్కడ ఆక్రమణలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ బోర్డులను సైతం తొలగించి యథేచ్ఛగా ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వేసవిలో చెరువులో నీరు తగ్గిన సమయంలో శిఖం భూముల్లో మట్టి పోసి చదును చేస్తూ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నా అధికారులు అడ్డుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపురం శివారులోనూ మళ్లీ ఆక్రమణలు!

కోదాడ పెద్ద చెరువు ఆక్రమణల వ్యవహారమే కాకుండా అనంతగిరి మండలం ఖానాపురం గ్రామ శివారులోనూ చెరువు శిఖం భూములు మళ్లీ ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనం చెరువు శిఖం భూమిలోనే ఉందని సంబంధిత అధికారులు నోటీసులు సైతం అంటించారు. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్వయంగా నోటీసులు జారీ చేసినా నిర్మాణం ఎందుకు ఆగడం లేదని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పలుకుబడితోనే ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణం కొనసాగుతుండటంపై అధికారుల పర్యవేక్షణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

600 మంది మత్స్యకారుల జీవనాధారానికి ముప్పు!

పెద్ద చెరువుపై ఆధారపడి సుమారు 600 మంది మత్స్యకార కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు పేర్కొంటున్నారు. చెరువు భూములు ఆక్రమణలకు గురైతే మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు భూములు కబ్జాకు గురవుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

రక్షణ గోడ ఎప్పుడొస్తుంది?

చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ శాశ్వత రక్షణ గోడ నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి సర్వే నిర్వహించాలని, అక్రమంగా చేపట్టిన మట్టి పోతలు, నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్ద చెరువు, ఖానాపురం శివారులోని చెరువు భూములను కాపాడుతారా? లేక ఆక్రమణలు కొనసాగుతుండగానే చోద్యం చూస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. చెరువులు కనుమరుగైతే భవిష్యత్తులో సాగు, తాగునీటితోపాటు మత్స్యకారుల జీవనోపాధికీ ముప్పు తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించకుంటే ఉద్యమిస్తాం: నాగేంద్రబాబు

పెద్ద చెరువు శిఖం భూముల ఆక్రమణలను అధికారులు తక్షణమే అడ్డుకోవాలని మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. సుమారు 600 మంది మత్స్యకార కుటుంబాల జీవనాధారమైన చెరువు భూములు కబ్జాకు గురవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించి చెరువు భూములను పరిరక్షించాలని కోరారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే మత్స్యకారులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జనరల్ NEWS

సింగిడి

వరదలను నివారించేందుకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం ఎంతో అవసరం

డీపీఆర్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వివరాలు తెలియజేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి



హన్మకొండ, నవంబర్ 4 (సింగిడి): అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించి వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా మంగళవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ నగరానికి సంబంధించి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్, హనుమకొండ చౌరస్తా అభివృద్ధి, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదే విధంగా వరంగల్ నగరంలో భవిష్యత్తులో వరదలను నివారించేందుకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం ఎంతో అవసరమని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే తయారు చేశామని, ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని వివరించారు. అందులో భాగంగానే ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధికి, హనుమకొండ చౌరస్తా, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ కు సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌ల ను కూడా తయారు చేసి సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వరంగల్ నగరానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్ట్‌ల డీపీఆర్‌ల పట్ల కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆత్మీయ పరిచయ కార్యక్రమం

హన్మకొండ, నవంబర్ 4 (సింగిడి): వరంగల్, ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో మంగళవారం ఆత్మీయ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్ ఖాన్, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర నాయకులు జిల్లా కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. అనంతరం రెండు బార్ అసోసియేషన్లతో పాటు మహిళా బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఛాంబర్‌ను సందర్శించి న్యాయవాదులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రామారెడ్డి సర్వోత్తం రెడ్డి మాట్లాడుతూ, హనుమకొండ జిల్లా కోర్టు సముదాయంలో సుమారు 3 వేల మందికి పైగా న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారని, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది, క్లయింట్లతో కలిపి సమాజంపై విశేష ప్రభావం చూపగల మేధావి వర్గంగా న్యాయవాదులు ఉన్నారని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీ అని, అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు తమ సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకొచ్చారని, ముఖ్యంగా హెల్త్ కార్డుల సమస్యతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వరంగల్ నగర అభివృద్ధి గురించి మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థి, ప్రజాప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

వ్యవసాయ ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా..

మూడు ట్రాక్టర్లు సీజ్

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రవాణాశాఖ అధికారుల చర్యలు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 4 (సింగిడి): వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్లను వాణిజ్య రవాణాకు ఉపయోగిస్తున్న వారి పై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తున్న మూడు వ్యవసాయ ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్, బాంబులగడ్డ ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అవసరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ మట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఫహిమ సుల్తానా, శ్రీనివాస్ పాల్గొన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య రవాణాకు ఉపయోగించరాదని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు నిరంతరం కొనసాగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న చాగంటి



హనుమకొండ, నవంబర్ 4 (సింగిడి): వరంగల్ మహానగరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డా,చాగంటి కోటేశ్వర రావు మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ కోటేశ్వర రావును ఆలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి,రామేశ్వర్‌రావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డా,వాసవీ రెడ్డి, ప్రధానార్చకులు శ్రీభద్రకాళి శేషుల పూర్ణకుంభంతో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో అ-ర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి తమ ప్రవచనం జరిపారు. ఈ సందర్భముగా శ్రీ చాగంటి కోటేశ్వరరావుని వారి ప్రవచనం వినుటకు అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



మిర్యాలగూడ నవంబర్ 4 (సింగిడి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అని అన్నారు. మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాల్ ద్వారా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 6వ తేదీన మిర్యాలగూడ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ , నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో పలు అభి వృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

- పీఎం రాహత్, రహవీర్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 4 (సింగిడి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. పీఎం రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందిస్తారని తెలిపారు. జిల్లాలో కిరణ్ ఆసుపత్రి, యోధా ఆసుపత్రి, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహకం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రహవీర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తారని వివరించారు. దేశవ్యాప్తంగా ఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జాతీయ స్థాయి అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని ఎస్పీ సూచించారు. ప్రమాద బాధితులను చూసి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మానవతా దృక్పథంతో స్పందించాలని, సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు.

దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

- ఆలేరులో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహణ
- దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు
- ఎంఈఓ ఎర్ర లక్ష్మి



ఆలేరు, నవంబర్ 4 (సింగిడి): దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి అన్నారు. మంగళవారం ఆలేరు మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎర్ర లక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు నేడు విద్య, క్రీడలు, ఉద్యోగాలు తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలుస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రభుత్వం సైతం దివ్యాంగుల కోసం అనేక విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగుల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పిస్తూ అన్ని విధాలా చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలతో పాటు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. నిర్వాహకులు విజేతలను అభినందించారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భవిత కేంద్రం విద్యార్థులతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులందరూ పాల్గొనాలని ఆమె ఆహ్వానించారు. విద్యార్థులు తమ ప్రతిభను జిల్లా స్థాయిలో కూడా చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ శ్రీనివాస్, స్పెషల్ ఎస్‌జీటీ రమేష్, ఎంఆర్‌సీ సిబ్బంది రాధిక, తిరుపతి, బాబా, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదు

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారుల హెచ్చరిక
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారుల అభ్యర్థిని బరిలో నిలుపుతాం
- ఇక్కిరి శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్



ఆలేరు, నవంబర్ 4 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని తెలంగాణ ఉద్యమకారుల మండల కో-కన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్, కోశాధికారి జంపాల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆలేరు పట్టణంలోని క్రాంతినగర్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నప్పటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతుండటం విచారకరమన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ హామీలను అమలుకు నోచుకోకుండా చేస్తోందని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అమరవీరుల ప్రాణత్యాగాలు, ఉద్యమకారుల ధైర్యసాహసాలు, వీరోచిత పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. అలాంటి ఉద్యమకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యమకారుల సమస్యలను తక్కువగా చూస్తే సహించేది లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులంతా ఏకమై మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాబోయే రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఉద్యమకారుల అభ్యర్థులను బరిలో నిలిపే అంశంపై ముందుకు సాగుతామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యమకారులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్ర జాన్సన్, మొరిగాడి అశోక్, చెక్క వెంకటేష్, బడుగు జాంగిర్, జింకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు ప్రక్రియను పరిశీలించిన డీఎంహెచ్ఓ అప్పయ్య



హన్మకొండ, నవంబర్ 4 (సింగిడి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని గట్లకానపర్తి ఉప కేంద్రం లో జరుగుతున్న గర్భిణుల నమోదు కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా నుండి 4 సూపర్ వైసర్ బృందాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేసేందుకు డాక్టర్ రజిత ప్రోగ్రాం ఆఫీసర్ గా నియమించడం జరిగిందని అందుకు గ్రామంలో గర్భిణుల నమోదు స్థితిగతులను పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమంది గర్భిణులు నమోదు అయ్యారు, ఇంకా ఎంతమంది నమోదు కావాల్సి ఉందనే వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల గుర్తింపు, ముందస్తు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించారు. ప్రతి గర్భిణిని మొదటి మూడు నెలల్లోనే గుర్తించి, తప్పనిసరిగా ఏ ఎన్ సీ నమోదు చేయాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిత, పి హెచ్ యన్, శోభ, హెల్త్ సూపర్ వైసర్ , రమాదేవి, పద్మజ, సంపత్, భద్రయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో షీ టీమ్స్ సమర్థవంతమైన సేవలు



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని, వేధింపులకు గురైన మహిళలు మౌనం వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం నల్లగొండ, మిర్యాలగూడ కేంద్రాలుగా రెండు షీ టీమ్స్ బృందాలు పనిచేస్తూ జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో షీ టీమ్స్‌కు 14 ఫిర్యాదులు అందగా, 3 పెట్టీ కేసులు నమోదు చేశామని, 49 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి, వేధింపులకు పాల్పడుతున్న 38 మందిని పట్టుకున్నామని తెలిపారు. మహిళల భద్రతపై 57 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో 492 సార్లు తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఫిర్యాదుల కోసం డయల్ 112 లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712670235ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, మహిళల రక్షణకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

నూతన ఎస్ఐ మదుకర్‌కు ఘన సన్మానం

ములుగు ప్రతినిధి, నవంబర్ 3 (నినాదం): ములుగు జిల్లా మంగపేట మండలానికి నూతనంగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ)గా బాధ్యతలు చేపట్టిన మధూకర్‌ను మంగపేట మండల సమాచార హక్కు వికాస సమితి (ఎస్‌హెచ్‌వీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఆర్టీఐ కమిటీ అధ్యక్షులు యర్రంగారి వీరన్ కుమార్ ఎస్ఐ మధూకర్‌కు శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మధూకర్‌కు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూనెం రాంబాబు, బట్ట సుధీర్, తక్కలపల్లి సతీష్, వీరగోని అఖిల్, నన్నేబోయిన సాంబయ్య, యరంగారి ప్రకాష్, బట్ట సతీష్, నూతులకంటి ఈశ్వర్ చంద్, ఇండ్ల నరసింహారావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఐడియల్ కంపెనీలో భారీ పేలుడు..



- నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం..
- ముగ్గురిని హైదరాబాద్‌కు తరలింపు

నల్లగొండ ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి సమీపంలోని ఐడియల్ కంపెనీలో మంగళవారం బ్లాస్టింగ్ ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. బ్లాస్టింగ్ ధాటికి భవనంలోని భాగాలు పేలుడు తీవ్రతకు చెల్లా చెదురుగా ఎగిరిపడటంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, మరొకరికి కామినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ముగ్గురు ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు కాగా, మరొకరు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): నల్లగొండ పట్టణంలోని 9వ డివిజన్ పరిధిలో సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీ వాసులతో కలిసి రోడ్డు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీ, వసుంధర కాలనీ, పటేల్ నగర్, సూర్యవంశం కాలనీ, చైతన్యపురి కాలనీలకు అనుసంధాన రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం 100 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడితే ఈ కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ భువనగిరి దేవేందర్, 9వ డివిజన్ కార్పొరేటర్ దీప్లా నాయక్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, గోపగోని స్వాతి, రాజశేఖర్ గౌడ్, టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దండంపల్లి

జనరల్ NEWS

సింగిడి

మాదిగల అభ్యున్నతికి సంఘాల ఐక్యతే బలం

మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి

రిజర్వేషన్ల ఫలాలు ప్రతి మాదిగ విద్యార్థికి అందాలి





సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): మాదిగల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి ఎం ఎస్ ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద గల మంజీరా హోటల్‌లో అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎం ఆర్ పి ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైసగాళ్ల బుచ్చేంద్ర మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి బుంజూరు విజయ్ మాదిగ, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వి. ఎస్. రాజు మాదిగ, ఎం ఎస్ పి ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 32 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటం మాదిగ సమాజానికి కీలక విజయాలను అందించిందని పేర్కొన్నారు. సాధించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదిగలు ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక వివక్ష, వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు సమష్టి పోరాటం అవసరమని తెలిపారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని, ఎం ఆర్ పి ఎస్ అనుబంధ సంఘాలను గ్రామస్థాయి నుంచి నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వివిధ మండలాలకు ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సమైక్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ, మహా జన సోసలిస్ట్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ, మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి దేవరంపల్లి అశోక్ మాదిగ, ఎం ఎం ఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కగల కవిత మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ఫోటోల వెంకటేష్ మాదిగ, గంధగళ్ళ వీరయ్య మాదిగ, నల్లోల ప్రవీణ్ మాదిగ, పుర్రె సంతోష్ మాదిగ, నటరాజ్ మాదిగ, జెమిని జాన్ మాదిగ, మోహన్ మాదిగ, కందుకూరు యేసయ్య మాదిగ, జంగం నవీన్ మాదిగ, గంగేరి శ్రీనివాస్ మాదిగ, పోతురాజు శివ మాదిగ, సీమోను మాదిగ, సంసాన్ మాదిగ, రమేష్ మాదిగ, నిర్మల్ మాదిగ, పెంటయ్య మాదిగ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబర్ 4 (సింగిడి): తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని అర్హులైన 40 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు సకాలంలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన దరఖాస్తులపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెక్కులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్రావు, భాగ్యానంద్, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి, మల్లేశ్ చారి, బాలకృష్ణ, విజయ్ రెడ్డి, సుమన్ గౌడ్, సర్వేష్ యాదవ్, నవీన్ రాజు, గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మొగ్దంపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా నర్సింగ్ పవార్.. ప్రధాన కార్యదర్శిగా యేసయ్య ఏకగ్రీవం





సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 4 (సింగిడి): ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మొగ్దంపల్లి మండల నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నిమ్మల కిష్టయ్య, జిల్లా అధ్యక్షులు పెద్దాపురం దుర్గయ్య పర్యవేక్షణలో, జిల్లా ప్రధాన కార్యదర్శి పవర్ హీరాలాల్ ఆధ్వర్యంలో ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గౌరవ అధ్యక్షులుగా పాండు చౌహాన్ (గూ నవీ, జాడి మల్కాపూర్), మండల అధ్యక్షులుగా నర్సింగ్ పవార్ (గూ ఇంగ్లీష్, జెడ్ పి హెచ్ ఎస్ మొగ్దంపల్లి), ప్రధాన కార్యదర్శిగా యేసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి సంఘ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఐక్యతను పెంపొందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

అనుమతి లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు

సాయి రామ్ బోర్వెల్ వాహనాలు సీజ్ భారీ జరిమానా

అక్రమ బోర్ల పై ఉక్కుపాదం : కాప్రా తాహసిల్దార్



కాప్రా, నవంబర్ 4 (సింగిడి): కాప్రా మండల పరిధిలోని మొన్న ఆదివారం రాత్రి మల్లికార్జున నగర్ లో అనుమతులు లేకుండా బోర్ వేస్తున్న సాయిరాం బోర్ వెల్స్ వాహనాన్ని కాప్రా మండల తాసిల్దార్ మతిన్ ఆదేశానుసారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్వర్ణలత రెడ్డి సీజ్ చేస్తూ మండల కార్యాలయానికి తరలించారు. మంగళవారం సాయిరాం బోర్వెల్ యజమాని సీజ్ అయిన వాహనానికి 50 వేల రూపాయల డిడి కట్టి ఇట్టి బోర్వెల్ వాహనాన్ని మండల కార్యాలయం నుండి విడిపించుకున్నారు. ఈ సందర్భంగా కాప్రా మండల రెవెన్యూ అధికారులు మండల పరిధిలో అనుమతి లేకుండా ఎవరు బోర్లు వేసిన కఠిన చర్యల్లో భాగంగా వాహనాలు, బోర్ సీజ్ చేస్తూ భారీ జరిమానా విధిస్తామని తెలియజేశారు.

నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రికి ఆహ్వానం

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు



కాప్రా, నవంబర్ 4 (సింగిడి): ఉప్పల్ నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని కోరుతూ మంగళవారం మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ల మర్యాద పూర్వకంగా కలిశారు. మేడ్చల్ జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏం ఎల్ ఏ మల్ రెడ్డి రంగ రెడ్డి, మల్ రెడ్డి రామ్ రెడ్డి, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగన్న ఆత్మీయ సమ్మేళనం

డీసీసీ అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 4 (సింగిడి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల కోసం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న ప్రమిద కన్వెన్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు .ఈ రోజు అంతా కార్యకర్తలకు అందుబాటు లో ఉండడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొని కార్యకర్తల కష్టనష్టాలను వివరించి ,వారి సమస్యలకు పరిష్కరించడం కోసం కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పెంచడం కోసం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి గారు నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శవం ముందు కూడా ఈగోనా.. అణగారిన వర్గాల ఐక్యత సాధించేది ఇలాగేనా..

- అణగారిన వర్గాల ఐక్యత మాటల్లో కాదు చేతల్లో చూపించండి
- షాద్‌నగర్ ఘటనపై పెద్దల అసహనం



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): శవం ముందు కూడా ఇగోనా, అణగారిన వర్గాల ఐక్యత సాధించేది ఇలాగేనా అంటూ షాద్ నగర్‌లో జరిగిన ఘటనపై సర్వత్రా అసహనం ఆందోళన వ్యక్తమైయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో చర్చనియాం శమైయింది. బాధిత కుటుంబం కాళ్లు పట్టుకునే పరిస్థితి తెచ్చిన ఆధిపత్య పోరాటాలు సిగ్గుచేటని పలువురు అసహనం వ్యక్తం చేశారు. అమ్మాయి చనిపోయి మూడు రోజులైంది కుటుంబం కన్నీరుమున్నీరవుతుంటే మీ సంఘాల పంచాయితీలు ఏంటని ప్రశ్నించారు. ఐక్యత గురించి మాట్లాడే వారిలోనే ఇంత ఇగో వివక్షత ఉంటే అణగారిన వర్గాలు ఐక్యమయ్యేది ఎప్పుడని అన్నారు. లా విద్యార్థిని చంద్రకళ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఒక పేద కుటుంబానికి చెందిన అమ్మాయి ఉన్నత చదువులు చదువుతూ భవిష్యత్తులో కుటుంబానికి అండగా నిలుస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలిందని, అయితే ఈ విషాద ఘటనలో మరింత కలచివేసిన విషయం మరొకటని అమ్మాయి చనిపోయి మూడు రోజులవుతోంది. కుటుంబాన్ని పరామర్శించడానికి, ఆ అమ్మాయిని ఆఖరిచూపు చూడటానికి బంధువులు, వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు వస్తుంటారు. ఇలాంటి సమయంలో బాధిత కుటుంబానికి మనం అండగా నిలబడాలి. వారి బాధను అర్థం చేసుకోవాలి. వారికి మనోధైర్యం కల్పించాలి. కానీ అక్కడ జరిగిన పరిణామాలు చూస్తుంటే బాధేస్తోందని పలువురు అన్నారు. ఒక సంఘానికి చెందిన నాయకులు అక్కడే చాలా సమయం పాటు నిలబడటం, దానిపై మరో సంఘానికి చెందిన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం, ఇరువర్గాల మధ్య బలమైన వాగ్వివాదం చోటుచేసుకోవడం జరిగింది. పరిస్థితి కొద్దిసేపు ఉంటే ఘర్షణకు దారితీసేలా కనిపించింది చివరికి కుటుంబ సభ్యులే సహనం కోల్పోయి కాళ్లు పట్టుకొని వేడుకునే పరిస్థితి వచ్చింది. మా అమ్మాయి చనిపోయి మేము పుట్టెడు దుఃఖంలో ఉంటే, మా ఇంటి దగ్గర మీ పంచాయితీలు ఏంటని మీ గొడవలు ఏంటని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేసిందని పేర్కొన్నారు. ఈ దృశ్యాన్ని చూసిన వారంతా తలపట్టుకొన్నారని తప్పలేదని ఇది ఇరువర్గాలు ఆలోచించాల్సిన సమయమని అన్నారు. కుటుంబం కన్నీళ్లలో ఉంటే ఆధిపత్యాన్ని చూపించుకోవాలని అలమటించడం విచారకరమని బాధిత కుటుంబం ముందు మన సంఘాల పేర్లు, వ్యక్తిగత ఇగోలు, ఇరువురి మధ్య ఉన్న విభేదాలు అంత ముఖ్యం కాదని అణగారిన వర్గాల ఐక్యత కావాలని, మాట్లాడుకుంటున్న తరుణంలో అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న తరుణంలో ఇరువురి మధ్యనే ఇంతటి ఇగోలు, వివక్షత, ఆధిపత్య పోరాటాలు ఉంటే మనం ఎప్పుడు ఐక్యమవుతామని స్వంత సామాజిక వర్గం మేధావులు ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం కలిసి పోరాదేది ఎప్పుడని మనం మారాలని మన ఆలోచనా విధానం మారాలని, ఒకరి బాధలో మరొకరం భాగస్వాములు కావాలని ఒకరినొకరు గౌరవించుకోవాలని హితవు పలికారు. సంఘాల మధ్య పోటీ కంటే సమాజ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రకళ లాంటి మరో బిడ్డను కోల్పోకుండా యువతకు అండగా నిలబడటం మనందరి బాధ్యతగా వ్యవహరించాలని పలువురు పిలుపునిచ్చారు. ఇలాంటి విషాద సమయంలోనైనా విభేదాలను పక్కనపెట్టి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. ఒక్కసారి ఆలోచించండి మధ్యనే గొడవలు పడితే హక్కుల కోసం మనతో కలిసి పోరాడేవారు ఎవరని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- షామీర్‌పేటలో వైభవంగా ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం
- మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆ ఎల్లమ్మ తల్లిని కోరుకున్నట్టు మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గం శామీర్‌పేటలో కొలువై ఉన్న శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్టు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విలాసాగరం సుదర్శన్, పవన్ గౌడ్ వర ప్రసాద్ రెడ్డి శివ నరేందర్ గౌడ్, శ్రీకాంత రెడ్డి గౌడ సంఘం నాయకులు, స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, నవంబర్ 4 (సింగిడి): భూసారాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి రైతులకు సూచించారు. కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ లతా శ్రీశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసుపోషణ, భూసంరక్షణపై 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను వినియోగిస్తూ సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. తద్వారా భూసారం పెరిగి నేల ఆరోగ్యం కాపాడబడుతుందని వివరించారు. అలాగే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందించి, సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూమేష్, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక భద్రతపై అవగాహన



కొడంగల్, నవంబర్ 4 (సింగిడి): అగ్నిప్రమాదాల నివారణ,అగ్నిమాపక భద్రతలపై కొడంగల్ లోని నవీన ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోడంగల్ అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాణసంచా వినియోగంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు మరియు ప్రమాదాల నివారణకు సంబంధించిన విలువైన సూచనలు అందించారు. విద్యార్థులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే దీపావళి వేడుకలు జరుపుకోవాలని, ప్రమాదకరమైన బాణసంచాకు దూరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో ఘనంగా యువజన ఉత్సవాలు

నవంబర్ 12న జిల్లా స్థాయి పోటీలు..

విజేతలకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం

రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 4 (సింగిడి): జిల్లాలోని యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించనున్నారు. 30వ జాతీయ యువజన ఉత్సవాలు--2027లో భాగంగా నవంబర్ 12వ తేదీన ఎల్.బి. నగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు.

పోటీలు.. అర్హతలు:

15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. వివిధ కళా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. – జానపద నృత్యం ((గ్రూప్): ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది (7 మంది నృత్య కళాకారులు, 3 మంది సహాయక కళాకారులు) పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా ప్రదర్శన ఉండాలి. సహాయక కళాకారుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చు. – జానపద గీతాలు: ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. భారతీయ సంప్రదాయ జానపద గీతాలకే ప్రాధాన్యత ఉంటుంది. సినిమా పాటలకు అనుమతి లేదు. – పోస్టర్ తయారీ: ూ3 పరిమాణంలో పోస్టర్ రూపొందించాలి. సమయం 90 నిమిషాలు. పోస్టర్‌పై సంస్థలు, బ్రాండ్ల పేర్లు ఉండకూడదు. 20 నుంచి 30 పదాలతో కూడిన శీర్షిక తప్పనిసరి. అవసరమైన సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. – వీధి నాటకం: ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది పాల్గొనవచ్చు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శన ఉండాలి. – కవితా రచన: తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో కవిత రాయవచ్చు. సమయం 60 నిమిషాలు. కవిత 500 పదాలకు మించకూడదు. ప్రతి కళాకారుడు ఒక పోటీ విభాగంలో మాత్రమే పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం:

జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలు రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు ఎంపికవుతారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు 2027 జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం పొందుతారు.

దరఖాస్తుల వివరాలు:

పోటీల్లో పాల్గొనాలనుకునే యువతీ యువకులు తమ పేరు, పూర్తి వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్, పాల్గొనదలచిన పోటీ విభాగం వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. – దరఖాస్తులకు చివరి తేదీ: నవంబర్ 11, 2026– ఈమెయిల్: ఎర్వజూతీతీఏస్త్రమ్ఖఅశ్రీ.ఎశీఏ– ఫోన్: 9849909077– కార్యాలయం: జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా. – పోటీల తేదీ: నవంబర్ 12, 2026– సమయం: ఉదయం 9 గంటల నుంచి– వేదిక: ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్, ఎల్.బి. నగర్, హైదరాబాద్. జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమలోని కళా నైపుణ్యాలను ప్రదర్శించాలని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ రంగారెడ్డి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత పిలుపునిచ్చారు.

నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అధిక ధరలు వసూలు చేస్తే కఠినచర్యలు

అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి



మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 4 (సింగిడి): తెలంగాణ రాష్ట్రంలో నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ (సివిల్ సప్లై) విజయేందర్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలు వరుసగా తెలంగాణ దీూ బియ్యం: కిలో రూ. 66 తెలంగాణ సోనా బియ్యం: కిలో రూ. 74– తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం: కిలో రూ. 79 రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ఠ ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో, సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇంత వరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేయబడినవి. జిల్లా సరఫరల అధికారి సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు తనిఖి లు చేయచున్నారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదే విధంగా ప్రతి రిటైల్ హోల్ సేల్ వ్యాపారి వారి షాప్ ముందు ఈ క్రింది విధంగా బ్యానర్ డిస్ప్లే చేయాలని తెలిపారు.





ఇండస్ట్రీకి గౌరవం ఇవ్వడం నేర్చుకోండి

హీరోయిన్లకు ఎస్.కె. ఎన్ వార్నింగ్



నందమూరి బాలకృష్ణ చిత్రం 'లెజెండ్' సినిమా గురించి బాలీవుడ్ నటి రాధికా ఆప్టే ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సౌత్ ఇండస్ట్రీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. వయసులో చాలా పెద్దవారైన నటుడితో రొమాన్స్ చేయించారని, సొంత మామను పెళ్లి చేసుకునే సన్నివేశాల్లో నటించమన్నారని, అంతేకాకుండా తన పాత్రను మధ్యలోనే చంపేశారంటూ చెప్పింది. దక్షిణాదిలో నటిస్తూ ఇక్కడే కోట్ల రూపాయల పారితోషికాలు, స్టార్‌డమ్ దక్కించుకుని.. కొన్నేళ్ల తర్వాత సౌత్ సినిమాలను, ఇక్కడి సంస్కృతిని తక్కువ చేసి మాట్లాడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా, ఈ అంశంపై టాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఎస్.కె.ఎన్ స్పందిస్తూ హీరోయిన్లకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాది చిత్రసీమలో పాత్రలు స్వీకరించి, పనిచేసి, ఇక్కడ గుర్తింపు, అవకాశాలు పొంది, ఆ తర్వాత కొన్నేళ్లకు అదే పరిశ్రమను, దాని కథలను, సాంస్కృతిక సంప్రదాయాలను విమర్శించడం ఒక దురదృష్టకరమైన ధోరణిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నటుడికి అభిప్రాయం వ్యక్తం చేసే హక్కు ఉందని, కానీ నిర్మాణాత్మక విమర్శకు, మిమ్మల్ని ఆదరించిన పరిశ్రమను పక్షపాతంతో తక్కువగా చూడటానికి మధ్య వ్యత్యాసం ఉందని స్పష్టం చేశారు. తెలుగు సినిమాకు స్వంత సాంస్కృతిక గుర్తింపు, సంప్రదాయాలు, కథ చెప్పే విలువలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వేరే ప్రాంతానికి చెందిన వారికి అసాధారణంగా అనిపించేది మన సంస్కృతిలో పూర్తిగా సాధారణం కావచ్చునని చెప్పారు. గౌరవం ఎప్పుడూ పరస్పరం ఉండాలని, అవకాశాలను ఆస్వాదించి ఆ తర్వాత వాటి వెనుక ఉన్న సంస్కృతిని అగౌరవపరచడం సరికాదని అన్నారు. నిర్మాణాత్మక విమర్శను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని, అయితే పక్షపాత విమర్శకు, సాంస్కృతిక ఆధిక్యతకు ఇక్కడ చోటు లేదని తేల్చిచెప్పారు. మిమ్మల్ని గౌరవించిన పరిశ్రమను మీరు కూడా గౌరవించడం నేర్చుకోవాలని హీరోయిన్లకు సూచించారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

Radhika Apte

ఈ సినిమాకు కథే అసలైన హీరో..

ప్రేక్షకుల ఆదరణే మాకు అసలైన బలం



కిషోర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాత ఎన్.ఎన్. కిషోర్ నిర్మిస్తున్న తొలి చిత్రం ప్రొడక్షన్ నెంబర్ 1 ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సినీ ప్రముఖులు, అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి. వినాయక్, ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేయడంతో ప్రారంభోత్సవ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వి.వి. వినాయక్ చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేయగా.. ముహూర్తపు షాట్‌కు నిర్మాత ఎన్.ఎన్. కిషోర్ క్లాప్ కొట్టారు. దర్శకుడు దివాకర్ యడ్ల మాట్లాడుతూ.. "ప్రేమ అంటే రెండు మనసుల మధ్య పుట్టే ఒక అందమైన అనుభూతి. దానిని తెరపై చూపించాలన్నదే మా ప్రయత్నం. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులందరికీ నచ్చేలా దీనిని తీర్చిదిద్దుతున్నాం. ఈ సినిమాకు కథే అసలైన హీరో. ప్రేక్షకుల ఆదరణే మాకు అసలైన బలం" అని అన్నారు.

'యువర్స్ బాబీ'

ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసిన బ్రహ్మాజీ



రావ్, రిచా జోషి, నటాషా సింగ్, ప్రాచీ థాకర్, హీరో హీరోయిన్లుగా.. రామ్ మోహన్ .సిహెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన లవ్ ఎంటర్‌టైనర్ 'యువర్స్ బాబీ'. జెనీషా ఏ వన్ మూవీ బ్యానర్‌పై సంజయ్ ఆర్, మల్కాజిగిరి రవికుమార్ నిర్మిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా, ప్రముఖ నటుడు బ్రహ్మాజీ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మల్కాజిగిరి రవికుమార్ మాట్లాడుతూ.. 'యువర్స్ బాబీ సినిమా నేటి యువతను ఆకట్టుకునే కథనంతో, డిఫరెంట్ సంగీతంతో ముందుకు సాగుతుంది. అలాగే సంగీతం మా చిత్రానికి గొప్ప ఎస్సెట్ కానుంది.. అలాగే ఈ చిత్రంలోని పాటలు కులుమనాలిలో 15 రోజులపాటు చిత్రీకరించాం. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న మా చిత్రానికి విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నాం' అని అన్నారు.

సిన్మా సింగిడి
Cinma Singidi
గురువారం
5-11-2026

singidinews@gmail.com

Disha Patani

నన్ను అలా అనుకోవద్దు..

దిశా పటానీ

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి, సాహో వంటి చిత్రాలతో మెప్పించిన ఈ భామ.. ఎంత బిజీగా ఉన్నప్పటికీ నిత్యం సోషల్ మీడియాలో హాట్ అండ్ గ్లామరస్ ఫోటోషూట్లతో రచ్చ చేస్తుంటుంది. తనదైన హాట్ షో చేస్తూ.. అందరినీ ఆశ్చర్యపరుస్తుంటుంది. దీంతో ఈ భామను చూడగానే ఈమె రియల్ లైఫ్‌లోనూ రాత్రింబవళ్లు పబ్‌లు, పార్టీలు, హ్యాంగౌట్స్‌తో కాలం గడిపేస్తుందని అంతా చర్చించుకుంటున్నారు. సినిమా అవకాశాలతో కంటే పార్టీలతో బిజీగా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, దిశా పటానీ తన గురించి ప్రచారంలో ఉన్న ఈ రూమర్స్ అన్నింటికీ చెక్ పెట్టింది. సోషల్ మీడియాలో కనిపించే తన గ్లామరస్ ఇమేజ్‌కి, తన రియల్ లైఫ్ స్వభావానికి అస్సలు సంబంధమే లేదని క్లారిటీ ఇచ్చింది. తాను అసలు పార్టీలకు తిరిగే రకమే కాదని, పర్సనల్ లైఫ్‌లో చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటానని తేల్చిచెప్పింది. ఎవరితోనూ త్వరగా కలవలేనని, బయట నెటిజన్లు అనుకుంటున్నట్టుగా నైట్ లైఫ్, పబ్ కల్చర్‌కు తాను చాలా దూరమని వెల్లడించింది. గ్లామర్ ఫొటోషూట్స్ చూసి తప్పుగా అనుకోవద్దని కోరింది. సినిమాల్లో కనిపించే గ్లామర్ పాత్రలు కేవలం నటనలో భాగం మాత్రమేనని, వాటిని వ్యక్తిగత జీవితంతో కంపేర్ చేయడం సరికాదని దిశా అభిప్రాయపడింది. షూటింగ్ లేని సమయంలో ఇంట్లోనే ప్రశాంతంగా ఉండటం, పుస్తకాలు చదువుకోవడం, జిమ్‌లో వర్కవుట్లు చేయడం, తన పెట్స్‌తో సమయం గడపడమే తనకు ఇష్టమైన పని అని చెప్పింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737